**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :74 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 4 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ పనుల్లో

# వేగం పెంచండి

- గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ పనులపై పవన్ కల్యాణ్ సమీక్ష
- మడఅడవుల విస్తరణలో దేశంలోనే రెండోస్థానానికి చేరుకున్నామన్న పవన్
- ఈ ఏడాది మరింత బాధ్యతగా మడఅడవుల పెంపకం చేపట్టాలని వ్యాఖ్య
- మడ అడవుల స్థాపనకు అక్టోబర్ నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి



**అమరావతి**

తీర ప్రాంత రక్షణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ పనుల్లో వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పనుల పురోగతిపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దేశించిన లక్ష్యం ఏ మేరకు పూర్తైంది? ఎన్ని మొక్కలు నాటారు? మడ అడవులు విస్తీర్ణంలో పెరుగుదల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాం జీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించారని గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనకు ఇది అదనపు బలమని పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## ప్రధాని వీడియో తొలగింపునకు

# జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

- మెటాతో పార్లమెంటరీ ప్యానెల్ చీఫ్
- అభ్యంతరకరమైన ఇతర కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అలాగే ఉంచి ఈ వీడియోపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకున్నారు? అని మెటా అధికారులను ప్రశ్న
- "ప్రధాని వీడియోను ఎందుకు తొలగించారు? ఇందుకు ఎవరు అనుమతి ఇచ్చారు?
- క్షమాపణలు చెబితే సరిపోదని బాధ్యత వహించాలని ఎంపీలు చెప్పినట్లు తెలుస్తోంది







## 19 మందితో కర్ణాటక మంత్రివర్గ విస్తరణ

- సీఎం డీకేతో కలిపి 33కు చేరిన మంత్రివర్గ సభ్యులు
- కార్యక్రమానికి హాజరుకాని సిద్ధరామయ్య

## శాంతిస్తున్న

# గోదావరి

- ప్రవాహం తగ్గినా లంక గ్రామాలకు చుట్టుముట్టూ వరదే
- ధవళేశ్వరం వద్ద క్రమంగా తగ్గుతున్న వరద ప్రవాహం
- ఒకటో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- కొనసాగుతున్న జలదిగ్బంధం
- పడవల్లోనే లంక వాసుల రాకపోకలు



**అమరావతి**

గోదావరికి ఎగువ నుంచి ప్రవాహం తగ్గింది. దీంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.5 అడుగులకు చేరింది. సముద్రంలోకి 9.73 లక్షల క్యూసెక్కుల వరద నీరు వెళ్తోంది. అయినా కోనసీమ జిల్లాను వరద చుట్టుముట్టే ఉంది. లంక గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. రాకపోకలకు




## రేపు దేవరపల్లిలో వైఎస్ జగన్

# పర్యటన

పొగాకు కొనుగోలు కేంద్రం సందర్శన


కొనుగోళ్ల పరిశీలన--రైతులతో ముఖాముఖి



**అమరావతి**

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 5న తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. దేవరపల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోళ్ల తీరును పరిశీలించడంతోపాటు ఆ రైతులతో నేరుగా మాట్లాడనున్నారు.

వివరాలు 2లో..



## ఇక్రిశాట్‌కు క్రిస్పర్ కాస్9

- ఉచితంగా దీర్ఘకాలిక లైసెన్స్ ఇచ్చిన అమెరికా సంస్థలు
- సరికొత్త జన్యు సవరణ వంగడాల రూపకల్పనకు మార్గం సుగమం
- స్వల్ప వ్యవధిలోనే క్షేత్రస్థాయికి కొత్త వంగడాలు

## గ్రీన్‌ఫీల్డ్..

# రయ్ రయ్

- ఖమ్మం--దేవరపల్లి హైవేపై రాకపోకలకు అనుమతి
- 2017లో డీపీఆర్, రూ.3,573 కోట్లతో నిర్మాణం
- హైదరాబాద్ నుంచి రాజమండ్రి, వైజాగ్‌కు సులభంగా ప్రయాణం
- ఇతర మార్గాలతో పోలిస్తే తగ్గనున్న దూరాభారం




**ఖమ్మం/అమరావతి**

ఖమ్మం--దేవరపల్లి నేష నల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు 165 కి.మీ మేర నిర్మించిన ఈ రహదారి ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద మొదలై ఏపీలోని రాజమండ్రి సమీపాన ఉన్న దేవరపల్లి వద్ద ముగుస్తుంది. 2017లో ఈ ప్రాజెక్టుకు రూ.3,573 కోట్లతో కేంద్రం ద్వారా అనుమతులు మంజూరయ్యాయి. ఈ రహ దారి నిర్మాణంతో ఏపీ వెళ్లే వారికి సుమారు 100 కి.మీ. కలిసి రానుంది. చిన్నచిన్న పనులు మినహా నిర్మా ణం పూర్తవడంతో ఇన్నాళ్లు వైరా మండలం సోమవరం నుంచే అనుమతించిన వాహనా లను ఆగస్టు 1నుంచి

వివరాలు 2లో..

# శాంతిస్తున్న గోదావరి

-మొదటిపేజీ తరువాయి

అయినవిల్లి మండలంలోని పలు లంక గ్రామాలను వరద వీడటం లేదు. లంకల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారి లంక, కొండుకుదురు లంకగ్రామాలు వరద గుప్పిట్లోనే ఉన్నాయి. కొండుకుదురు లంకలోని ఆర్ల అక్కమ్మ తల్లి ఆలయాన్ని వరద చుట్టుముట్టింది. గౌతమీ గోదావరి నదిలో వరద పెరుగుతుండటంతో కోటిపల్లి కుమ్మరి సావరం వద్ద ఏటిగట్టు బలహీనపడింది. ఏటిగట్టును పటిష్టం చేసేందుకు అధికారులు ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా రివెట్‌మెంట్‌ను నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పి.గన్నవరం మండలం చాకలిపాలెం సమీపంలోని కనకాయలంక కాజ్‌వే ముంపులోనే ఉంది. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడిచిపెట్టే వరద 6 లక్షల క్యూసెక్కులకు తగ్గితే కానీ కనకాయలంక కాజ్‌వే ముంపు నుంచి బయటపడే అవకాశం ఉండదు. అప్పటిదాకా గ్రామస్థులు మరపడవలను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. వశిష్ట వైనతేయ, గౌతమి, వృద్ధ గౌతమి గోదావరి నది పాయలు పొంగి ప్రవహిస్తుండటంతో వరద ఉద్ధృతంగానే కొనసాగుతోంది.

లంకభూముల్లోని ఉద్యాన పంటలు ముంపు బారినపడ్డాయి. పి.గన్నవరం, మామిడికుదురు, ముమ్మిడివరం, అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం, మలికిపురం సహా పలు మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల పంటలు, అరటితోటలు జలమయమయ్యాయి. ముమ్మిడివరం మండలం పరిధిలోని గురజాపులంక, కూనలంక, లంకాఫ్ ఠాణేలంక గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. కె.గంగవరం మండలంలో 5000ల ఎకరాల్లోని కూరగాయల పంటలు నీటమునిగాయి. వరద తగ్గుముఖం పడుతున్న ప్రాంతాల్లో



సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్?కుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద అనంతర సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేలా చూడాలని తెలిపారు. తాగునీటి సమస్యలను 4 నుంచి 5 గంటల్లోగా పూర్తిగా పరిష్కరించాలని స్పష్టంచేశారు. ముంపు ప్రాంతాల్లో మరో రెండు రోజుల పాటు వైద్య శిబిరాలు కొనసాగించాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

మరోవైపు తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం త్యాజంపూడిలో బర్ల, మురుగు వాగుపై అడ్డంగా తూరలు పెట్టడంతో సుమారు వంద ఎకరాల వరి పంట నీట మునిగిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. కోరుమామిడి గ్రామానికి చెందిన ఓ రైతు ఎలాంటి అనుమతులు లేకుండా తూరలతో అడ్డుగా వంతెన నిర్మించడంతో 3 రోజులుగా పంట నీటమునిగిందని వారు ఆరోపించారు.

# మార్కెట్లో నకిలీ 'వైజాగ్ టీఎంటీ' కడ్డీలు

## ఆర్ఐఎన్ఎల్ హెచ్చరిక


సొంతింటి కలను నిజం చేసుకునేందుకు ఇల్లు కడుతున్నారా? భవన నిర్మాణాలకు వాడే స్టీల్ కొనుగోలు చేస్తున్నారా? అయితే మీరు కచ్చితంగా అప్రమత్తం కావాల్సిందే. మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన, నమ్మకమైన బ్రాండ్ 'వైజాగ్ టీఎంటీ' పేరుతో నకిలీ స్టీల్ కడ్డీలు విచ్చలవిడిగా చలామణి అవుతున్నాయి. ఈ మేరకు విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి (విశాఖ స్టీల్ ప్లాంట్) చెందిన కార్పొరేట్ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) ఖాతాదారులకు, ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. నకిలీ ఉత్పత్తుల పట్ల ప్రజలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**నాసిరకం ప్యాకింగ్**

విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన ప్రతిష్టాత్మక బ్రాండ్ 'వైజాగ్ టీఎంటీ'. దీనికి మార్కెట్లో ఎంతో విశ్వసనీయత ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వైజాగ్ టీఎంటీ పేరుతో నకిలీ, నాసిరకం స్టీల్ కడ్డీలను విక్రయిస్తున్నట్లు సంస్థ దృష్టికి వచ్చింది. ప్యాకింగ్ విషయంలోనూ వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. అచ్చం వైజాగ్ స్టీల్ తరహాలోనే ప్యాకింగ్ చేస్తూ మోసం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి మోసపూరిత ముఠాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది.

**ప్రమాదంలో భవనాల భద్రత**

ఇల్లు, వాణిజ్య సముదాయాలు లేదా ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణంలో స్టీల్ పాత్ర అత్యంత కీలకం. నకిలీ బ్రాండ్లతో వస్తున్న నాసిరకం స్టీల్ కడ్డీలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండవు. ఇవి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉంటాయి. వీటిని వాడటం వల్ల నిర్మాణాల భద్రత, బలం దెబ్బతింటాయి. భవిష్యత్తులో భవనాలు



కూలిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. మన్నిక లేని ఈ నకిలీ కడ్డీలను కొనుగోలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**'అసలైన వైజాగ్ టీఎంటీని మాత్రమే కొనండి'**

వినియోగదారులు, కాంట్రాక్టర్లు స్టీల్ కొనుగోలు చేసేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. కేవలం ఒరిజినల్ ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలి. ప్రతి అసలైన టీఎంటీ కడ్డీపై 'వైజాగ్ టీఎంటీ' అనే బ్రాండ్ పేరు స్పష్టంగా ముద్రించి ఉంటుంది. కొనుగోలు చేసే సమయంలో ప్రతి కడ్డీపై ఈ మార్కు ఉందో లేదో ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. నమ్మకమైన, అధికారిక డీలర్ల వద్ద మాత్రమే స్టీల్ కొనుగోలు చేయడం ఉత్తమమని సంస్థ సూచిస్తోంది.

**సందేహాలుంటే ఇక్కడ సంప్రదించండి**

కొనుగోలుదారులు తాము కొంటున్న స్టీల్ అసలైనదో, నకిలీదో తెలుసుకోవడానికి ఆర్ఐఎన్ఎల్ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. ఒరిజినల్ ఉత్పత్తుల కొనుగోలు కోసం లేదా నకిలీ ఉత్పత్తుల నిర్ధారణ కోసం దగ్గర్లోని ఆర్ఐఎన్ఎల్ బ్రాంచ్ ఆఫీసు లేదా మార్కెటింగ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. బ్రాంచ్ సేల్స్ ఆఫీసుల వివరాలు, సంబంధిత అధికారుల కాంటాక్ట్ నంబర్లను సంస్థ అధికారిక వెబ్ సైట్ ఞఞఞ.జఅఓఞస్త్రర్వవశ్రీ.ఞశీఎ లో పొందుపరిచారు. ఈ వెబ్ సైట్ లోని 'మార్కెటింగ్' విభాగంలోకి వెళ్లి 'నెట్ వర్క్' ఆప్షన్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని ఆర్ఐఎన్ఎల్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ డీజీఎం జే. మల్లికార్జునరావు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్

## అధికారిక బులెటిన్ విడుదల చేసిన ఏపీ అసెంబ్లీ

ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బుసినె విరూపాక్షిని పోలీసులు అరెస్టు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభ అధికారిక బులెటిన్ విడుదల చేసింది. ఆగస్టు 2న తెల్లవారుజామున 3 గంటలకు కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామంలోని ఆయన నివాసంలో ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసినట్లు వెల్లడించింది. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 37/2026 కేసులో ఎమ్మెల్యే బుసినె విరూపాక్షిని ఏ-1గా చేర్చినట్లు బులెటిన్‌లో వెల్లడించింది. క్రైమ్ నంబర్ 38/2026 కేసులో కూడా ఆయన ఏ-1 నిందితుడిగా ఉన్నట్లు తెలిపింది. ఈ కేసులో భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టంలోని సెక్షన్లు కూడా నమోదు చేసినట్లు శాసనసభ సభ్యులకు అధికారికంగా తెలిపింది. ఈ మేర అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.

అసలేం జరిగింది?

కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం సంగాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గురునాథ్, వైఎస్సార్సీపీ కార్యకర్త గిరి శనివారం ఏదో విషయమై ఫోన్లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో గిరి ఇంటికి గురునాథ్‌తో పాటు టీడీపీకే చెందిన సుధాకర్, చంద్రశేఖర్, నేమకల్లు గ్రామానికి నాగరాజు, శివ వెళ్లారు. వారి మధ్య తోపులాట జరగడంతో గ్రామస్థులు నచ్చజెప్పి పంపేశారు. తనను టీడీపీ కార్యకర్త దూషించాడని ఎమ్మెల్యే విరూపాక్షికి గిరి ఫిర్యాదు చేశాడు.

50 మంది వాహనాల్లో

దీంతో చిప్పగిరి నుంచి విరూపాక్షి తన కుమారుడు చంద్రశేఖర్, ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు ఆయన కుమారుడు మధు తదితరులు సుమారు 50 మంది వాహనాల్లో కర్రలు, రాళ్లు, రాడ్లతో తొలుత సంగాల వెళ్లారు. అక్కడ టీడీపీ కార్యకర్త చంద్రశేఖర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ తర్వాత వారంతా నేమకల్లు వెళ్లారు.



అక్కడ రాళ్లు రువ్వుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు కింది పడిపోవడంతో అతని చేయి విరిగింది. దీనికి టీడీపీకు చెందిన నాగరాజు కారణమని భావించిన ఎమ్మెల్యే విరూపాక్షి, అనుచరులు అతని ఇంటికి వెళ్లారు.

అక్కడ ఆయన భార్య సుచిత్రతో అభ్యంతరకరంగా ప్రవర్తించారు. ఆమె దుస్తులను చించివేశారు. ఇంట్లోకి దూసుకెళ్లి టీవీ, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. నాగరాజును చంపేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. దీంతో నాగరాజు బయటకు వచ్చి వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆయనపైనా దాడికి దిగారు. కుటుంబసభ్యులు ప్రతిఘటించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే విరూపాక్షి దాడికి వెళ్లబోతున్నారని సంకేతాలు రావడంతో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ముందే వారించారు. అయినా, వినిపించుకోలేదని తెలిసింది.

## గ్రీన్‌ఫీల్డ్.. రయ్‌రయ్

-మొదటిపేజీ తరువాయి

ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు ప్రారంభ స్థానం నుంచి అనుమతిస్తున్నారు.

**2017లో రూ.3,573 కోట్లతో...**

భారత్ మాల ఎకనామిక్ కారిడార్ పథకం కింద ఖమ్మం--దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి సమీపంలో ఉన్న దేవరపల్లి వరకు 165 కిలోమీటర్ల నిడివితో నిర్మించగా, తెలంగాణలో 90 కి.మీ., ఏపీలో 75 కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉంటుంది. 2017లో డీపీఆర్ సిద్ధం కాగా, రూ.3,573 కోట్లతో కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. 2018 నాటికే భూసేకరణ పూర్తి చేశారు. ఈ రహదారి నిర్మాణంలో పలు అడ్డంకులు ఎదురైనా ఎట్టకేలకు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

**తగ్గనున్న ప్రయాణ సమయం**

ఈ హైవే అందుబాటులోకి రావడంతో హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. తద్వారా సుమారు 56 కి.మీ., సూర్యాపేట నుంచి చూస్తే దాదాపు 100 కి.మీ. దూరం తగ్గుతుంది. గతంలో సూర్యాపేట నుంచి విజయవాడ మీదుగా రాజమండ్రి చేరుకోవాలంటే ఆరు గంటల సమయం పట్టేది. కొత్త హైవేతో కేవలం ఐదు గంటల్లోనే గమ్యం చేరుకోవచ్చు. ఈ కారిడార్ ద్వారా ఏపీలోని ఏడు జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర, కోల్‌కతా వరకు నేరుగా అనుసంధానం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

**ప్రత్యేకతల రహదారి**

ఖమ్మం--దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. తెలుగు రాష్ట్రాల్లోనే మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్‌వేగా చెప్పవచ్చు. నిర్ణీత ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద మాత్రమే ప్రవేశం కల్పిస్తూ ప్రతీ 18 కి.మీ.కు ఒక ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేశారు. ప్రయాణించిన దూరం ఆధారంగా టోల్ వసూలుకు 'క్లోజ్డ్ టోలింగ్ సిస్టం'ను అందుబాటులోకి తెచ్చారు. భద్రతా కోణంలో ఐదుచోట్ల అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఏటీఎంఎస్), ప్రతీ రెండు కి.మీ.కు 360 డిగ్రీల సీసీ కెమెరాలు, సోలార్ దీపాలు, ప్రతీ ఐదు కి.మీ.కు ఒక ఎమర్జెన్సీ ఓపెనింగ్‌లు ఏర్పాటు చేశారు. అతివేగం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలను ఏఐ కెమెరాల ద్వారా గుర్తించి నేరుగా చలాన్లు జారీ చేస్తారు. ప్రతీ 50 కిలోమీటర్లకు ఐదు ఎకరాల విస్తీర్ణంలో హోటళ్లు, పెట్రోల్ బంకులు, వాష్‌రూమ్‌ల వంటి సదుపాయాలు కల్పించే పనులు మొదలయ్యాయి. క్యూఆర్ కోడ్ ద్వారా సమీప పోలీస్‌స్టేషన్, పెట్రోల్ బంక్ వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఈ హైవేపై గరిష్టంగా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వీలుంది.

**గ్రీన్‌ఫీల్డ్ హైవే వివరాలు**

ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు దూరం 165 కి.మీ.
తెలంగాణలో నిడివి 90 కి.మీ.
ఆంధ్రప్రదేశ్‌లో నిడివి 75 కి.మీ.
మొత్తం వ్యయం రూ. 3,573 కోట్లు

## గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ పనుల్లో వేగం పెంచండి

-మొదటిపేజీ తరువాయి

మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినందుకు కృషి చేసిన అధికారులకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలియజేశారు. ఎల్?నినో వంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి తీరాన్ని రక్షించుకోవడంలో గ్రీన్ వాల్ ప్రాజెక్టు కీలకమన్నారు. 1053 కిలోమీటర్ల తీరం పొడవునా 5 కిలోమీటర్ల వెడల్పున హరితగోడను ఏర్పాటు చేస్తున్నామని ఈ ఏడాది 8888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణ జరగనుందని వివరించారు. తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయని చెప్పారు. అందుకే తాటివనాలు, సామాజికవనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు.

727 హెక్టార్లలో : మడ అడవుల స్థాపనకు అక్టోబర్ నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని, ఈ ఏడాది మరింత వేగంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని అధికారులను పవన్ ఆదేశించారు. గ్రీన్ వాల్ కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా 5000ల హెక్టార్లలో తాటి వనాలు నాటుతున్నామని, గ్రీన్ క్లైమేట్ ఫండ్ కింద మరో 1993 హెక్టార్లను దేశీయ మొక్కలతో నింపుతామని వివరించారు. 727 హెక్టార్లలో షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్లు లక్ష్యాలుగా నిర్దేశించినట్లు చెప్పారు. గ్రేట్ గ్రీన్ వాల్ కింద 5 కిలోమీటర్ల వెడల్పుతో తీరానికి మూడంచెల రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు.

మొదటి వలయంలో మడ అడవుల పునరుద్ధరణ, షెల్టర్ బెల్ట్‌ల మొక్కల పెంపకం, రెండు, మూడు వలయాలను కమ్యూనిటీ బఫర్ జోన్లుగా గుర్తించి గ్రామ వనాలు, సామాజిక వనాలు, వ్యవసాయ వనాల పెంపకాన్ని ప్రజలు, వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందనని చెప్పారు. ఏపీ గ్రీనింగ్ అండ్ క్లైమెట్ ఛేంజ్ మిటిగేషన్ సొసైటీ ద్వారా గ్రీన్?వాల్ లక్ష్య సాధన దిశగా అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నట్లు పవన్? కల్యాణ్? తెలిపారు.

## రేపు దేవరపల్లిలో వైఎస్ జగన్ పర్యటన

-మొదటిపేజీ తరువాయి

పర్యటనలో భాగంగా బుధవారం ఉ.9.30 గంటలకు వైఎస్ జగన్ తాడేపల్లిలో బయల్దేరి, ఉ.10.30కు దేవరపల్లి చేరుకుంటారు. అక్కడి పొగాకు కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోళ్లను పరిశీలిస్తారు. అనంతరం.. పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించి, పంట సాగు, గిట్టుబాటు ధర, కొనుగోళ్లు, సమస్యలు తదితర అంశాలను నేరుగా వారిని అడిగి తెలుసుకుంటారు.

## వీర మహిళలకు పెద్ద పీట....

**కాకినాడ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

## వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..

**విజయవాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహును ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నివేదికలను కపిల్ సాహు టీం జగన్ కు అందిస్తున్నట్లు సమాచారం. అందుకే జగన్ ఈసారి ఎన్నికల్లో తమదే గెలుపు అన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు.

# గుంటూరు ఛానల్ విస్తరణకు మూడో విడత పరిహారం విడుదల.

- పెమ్మసాని చొరవతో రైతుల ఖాతాల్లోకి రూ.10 కోట్లు జమ.
- జిజి పాలెం, రావిపాడు గ్రామాల 37 మంది రైతుల ఖాతాల్లో జమ.
- ఇప్పటికే రెండు విడతల్లో రూ.28.12 కోట్లు చెల్లింపు.
- మూడు విడతల్లో కలిపి రూ.38.12 కోట్ల పరిహారం.
- మొత్తం పరిహారంలో 54 శాతం చెల్లింపులు పూర్తి.
- మిగిలిన పరిహారాన్ని కూడా త్వరలో పూర్తిగా చెల్లిస్తాం

**గుంటూరు, పెన్ సత్తా, ఆగస్ట్ 03:** గుంటూరు ఛానల్ విస్తరణ పనుల్లో భాగంగా భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం పరిహారపు నిధుల మూడో విడతను విడుదల చేసింది. గుంటూరు ఛానల్ ఎక్స్‌టెన్షన్ కోసం భూములు ఇచ్చిన జిజి పాలెం, రావిపాడు గ్రామాలకు చెందిన 37 మంది రైతుల ఖాతాల్లో మూడో విడతగా రూ.10 కోట్ల పరిహారం జమ అయింది.

ఇప్పటికే తొలి విడతగా రూ.10.54 కోట్లు, రెండో విడతగా రూ.17.58 కోట్లు కలిపి రూ.28.12 కోట్లను రైతులకు ప్రభుత్వం చెల్లించింది. తాజాగా విడుదల చేసిన రూ.10 కోట్లతో కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ.38.12 కోట్ల పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయింది.

గుంటూరు ఛానల్ విస్తరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన మొత్తం పరిహారం రూ.70. 17లు కాగా, ఇప్పటి వరకు రూ.38.12 కోట్లు చెల్లించడంతో దాదాపు 54 శాతం పరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. ఇంకా చెల్లించాల్సిన సుమారు రూ.32.05 కోట్ల పరిహారాన్ని కూడా త్వరలోనే పూర్తిగా రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

గుంటూరు ఛానల్ విస్తరణకు అవసర మైన భూ సేకరణలో రైతులను సమన్వయం చేయడంతో పాటు, భూములు ఇచ్చిన రైతులకు సకాలంలో పరిహారం అందేలా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం చెల్లింపులు వేగంగా జరిగేలా చర్యలు చేపడుతున్నారు. గుంటూరు ఛానల్ విస్తరణ పూర్తయితే ఈ ప్రాంతంలో సాగునీటి సదుపాయాలు మరింత మెరుగుపడి, వ్యవసాయానికి గణనీయ మైన ప్రయోజనం చేకూరనుంది. అభివృద్ధి ప్రాజెక్టుల అమలుతో పాటు భూములు ఇచ్చిన రైతుల ప్రయోజనాలను పరి రక్షించడానికీ కూటమి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోంది. రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, పరిహారం చెల్లింపులను వేగవంతం చేస్తూ వారికి న్యాయం జరిగేలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.రైతులకు చెల్లించాల్సిన మిగిలిన పరిహారాన్ని కూడా త్వరితగతిన పూర్తిచేసి, గుంటూరు ఛానల్ విస్తరణ పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.



# వేమండలో ‘2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం’ కార్యక్రమంలో యార్లగడ్డ.





- రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే.
- ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన యార్లగడ్డ.
- వేమండలో ఇప్పటివరకు రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని వెల్లడి.
- కలవపాముల రహదారి అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధిస్తామని హామీ.
- గత ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే యార్లగడ్డ విమర్శ.

**గన్నవరం, పెన్ సత్తా, ఆగస్ట్ 03:** ఉంగుటూరు మండలం వేమండ గ్రామంలో సోమవారం నిర్వహించిన ‘2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం’ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అంతకు ముందు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గన్నవరం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో రహదారులు దయనీయ స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గుడివాడ, కలవపాముల, తరిగొప్పల, మానికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రహదారులలో సుమారు 80 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వేమండ గ్రామంలో ఇప్పటికే ఆరు సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు, హెడ్ పంప్ ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్ పథకం కింద రూ.37 లక్షల వ్యయంతో 250 విద్యుత్ స్తంభాల మార్పిడి, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, రూ.12 లక్షలతో వ్యవసాయ విద్యుత్ సేవల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.1.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. కలవపాముల రహదారి అభివృద్ధికి సుమారు రూ.1.70 కోట్లు అవసరమవుతున్నాయని, ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మిగిలిన సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులకు కూడా ప్రాధాన్యమిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజలు కోరిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు మండల తహసీల్దార్ జలాది విమల కుమారి, ఎంపీడీవో ఈ సత్య కుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, తోట నాగభూషణం, కాపుదాసి సునీల్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, తేలప్రోలు పిఎసిఎస్ చైర్ పర్సన్ ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, ఉయ్యూరు మురళి, బెజవాడ నాగేశ్వరరావు, రాజబోయిన శివాజీ, తుమ్మల జగదీష్, యర్రగుంట్ల వినోద్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, పసుపులేటి సుబ్బారావు, కానూళ్ల శ్రీను, పకీరు, పొన్నగంటి బాలకృష్ణ, వెనిగళ్ళ రాము, గంప భీమయ్య, యలమంచిలి దినేష్, మరీదు శ్రీను, శివరాం, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి, జనసేన నాయకులు చిమట రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.



# తక్కువ ధరలకే బియ్యం విక్రయాలు.

- ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం.
- బియ్యం కొనుగోలుదారులు-రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 03:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు అనకాపల్లి రింగ్ రోడ్డులో గల ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ లో రైతు బజార్ నందు, రైతు బజార్లు, రైస్ మిల్లర్ల సౌజన్యంతో సామాన్యులకు నేరుగా బీపీటీ సన్న బియ్యం తక్కువ ధరకు రూ 52/- లకే నెలకు 10 కేజీల బియ్యం అందించాలనే సంకల్పంతో, సోమవారం ఉదయం జిల్లా సివిల్ సప్లై అధికారులు స్టాల్ ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ మాట్లాడుతూ, స్టీమ్ బియ్యం (బి.పి.టి.)బహిరంగ మార్కెట్ ధర 62.00 ఉండగా, ప్రత్యేక కౌంటర్ల ద్వారా 52.00/-లకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా రా-బియ్యం (బి.పి.టి.)బహిరంగ మార్కెట్ ధర 58.00/- ఉండగా, ప్రత్యేక కౌంటర్ల ద్వారా 50.00/- లకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సామాన్య ప్రజలందరు వినియోగించుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ విజ్ఞప్తి చేశారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే ప్రత్యేక కౌంటర్లలో బియ్యాన్ని అత్యంత తక్కువ ధరకు అందుబాటు లోకి తీసుకు వచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు రాష్ట్ర రైస్ మిల్లర్ల సహకారంతో బీపీటీ స్టీమ్ సన్న బియ్యాన్ని కిలో కు రూ.52 కే అందుబాటు లోకి ప్రభుత్వం తీసుకువచ్చింది అన్నారు. ప్రతి అర్హత కుటుంబానికి నెలకు 10 కిలోల బియ్యాన్ని అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బియ్యం కొనుగోలు చేయడానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. కేంద్రంలో వారి వివరాలను నమోదు చేసి బియ్యాన్ని అందజేస్తారని రామక్రిష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, డి ఎం సివిల్ సప్లై, డీఎస్ఓ సివిల్ సప్లై, ద్వారపురెడ్డి పరమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.







# గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం అయ్యన్న పాత్రుడు.

- సంకల్పం 2.0 కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించిన శాసనసభ స్పీకర్.
- మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం.
- విద్యార్థులు, యువత భవిష్యత్తును కాపాడటానికే జిల్లా పోలీస్ ప్రత్యేక చొరవ.
- గంజాయి ఇతర మత్తు పదార్థాల సమాచారం ఇచ్చేందుకు 112, 1972 టోల్ ఫ్రీ నంబర్లు సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఖ్రూ.



**నర్సీపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 03:** మాదకద్రవ్యాల రహిత సమాజమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా చేపడుతున్న చర్యల్లో భాగంగా, అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన సంకల్పం 2.0 మెగా గంజాయి అవగాహన కార్యక్రమం సోమవారం నాడు నర్సీపట్నం సమీపం లోని స్టార్ హోమ్స్ ఫంక్షన్ హాల్లో అత్యంత వైభవంగా ప్రారంభ మైంది. ఈ వినూత్న కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ వేదిక పై అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) తుహిన్ సిన్హా, ప్రముఖ సినీ నటుడు బ్రహ్మాజీ, జడ్పిటిసి ఎస్.రమణమ్మ, జనసేన నాయకులు సూర్యచంద్ర, డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ

సమాజానికి పట్టిన గంజాయి మహమ్మారిని పెకలించి వేయడంలో మీడియా, విద్యార్థులు, తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని పిలుపు నిచ్చారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, గంజాయి నిర్మూలనకు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ

గత కొద్ది కాలంగా గంజాయి సాగు, అక్రమ రవాణాను 90% పైగా అరికట్టగలిగామని తెలిపారు. చెక్ పోస్టులు, నిఘా కెమెరాలు, డ్రోన్లు, స్నిఫర్ డాగ్స్ సహాయంతో అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని చెప్పారు. అయితే, గంజాయి వినియోగాన్ని తుడిచి పెట్టాలంటే ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. మత్తుకు బానిసలైన వారిని నేరస్థులుగా చూడకుండా ‘డీ-ఎడిక్షన్ సెంటర్ల’ ద్వారా వారికి చికిత్స అందించి పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజల రక్షణ కోసం 112, గంజాయి సమాచారం అందించడానికి 1972 టోల్ ఫ్రీ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని, ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత అని వివరించారు. ?సినీ నటుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ యువత తమ లక్ష్యాల వైపు పయనించాలే తప్ప, వ్యసనాల బారినపడి తల్లిదండ్రులు కన్న కలలను కల్లలు చేయకూడదని, పోలీసుల ఈ “సంకల్పం 2.0” ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు.

ఈ బహిరంగ అవగాహన సదస్సుకు వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, మహిళలు, స్థానిక ప్రజలు హాజరయ్యారు. మత్తు పదార్థాల దుష్పరిణామాల పై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో సీఐలు గఫూర్, రేవతమ్మ, మురళి, రామకృష్ణ, సతీష్, పిల్లా రమేష్, ఈగల్ ఇన్ స్పెక్టర్లు దేవుళ్ళు, నాగరాజు, ఎస్సైలు రాజారావు, ఉమామహేశ్వర రావు, రమేష్ లతో పాటు పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.




**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 03:** జిల్లాలో ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పుట్టిన వెంటనే తల్లిపాలను పిల్లలకు పట్టడం, తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం తగిన పోషక ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించడం వల్ల శిశువుల ఆరోగ్యకర మైన ఎదుగుదల, అభివృద్ధికి కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా లోని ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లి, కుటుంబానికి చేరవేసి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అచ్చుతకుమారి, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డా. చంద్రశేఖర్ దేవ్, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సూర్యలక్ష్మి, ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఐసీడీఎస్), సీడీపీఓలు పాల్గొన్నారు.

PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
మంగళవారం 4 ఆగస్టు 2026

# అర్జీదారుల సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు జిల్లా కలెక్టర్

- భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి.
- పి జిఆర్.ఎస్ కు-170 , రెవెన్యూ క్లినిక్ కు 145 - అర్జీలు.





**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 03** : పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ లకు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, డి.ఆర్వో వై.సత్యనారాయణ రావులు పాల్గొని జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు అందిన అర్జీల స్థితిగతుల పై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ పలు శాఖల అధికారుల నిర్లక్ష్య వైఖరి పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పై క్షేత్ర స్థాయి పరిశీలన జరపకుండా, అర్జీలను పెండింగ్‌లో పెట్టడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీ పై అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నేరుగా పరిశీలన జరపాలని, కార్యాలయాలకే పరిమితమై అర్జీలను నామ మంత్రముగా ముగించవద్దని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిశీలిస్తుంటే, టూరిజం, దేవాదాయ శాఖ, అధికారులు ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పురోగతి లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్ స్కూల్స్, సంక్షేమ శాఖ, వెల్ఫేర్ రెసిడెన్షియల్ కో ఆర్డినేటర్లు, తమ బాధ్యతల పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. లేబర్, కమర్షియల్ టాక్స్ సిబ్బందికి సంబంధించిన ప్రమోషన్లు, పోస్టింగ్‌లు మరియు పెండింగ్ వినతులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సెర్ప్ అందిన అర్జీల పరిష్కార వేగాన్ని పెంచి, అన్ని అర్జీలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ప్రజలను తిప్పించుకునే అధికారుల పై శాఖాపర మైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశిత సమయంలోగా ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.
పి.జి.అర్.ఎస్ లో 170, రెవిన్యూ క్లినిక్ లో 145 అర్జీలు మొత్తం 315 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జంఝావతి సాధన దీక్షలకు సన్నద్ధం...

- దీక్షలకు రైతులంతా తరలి రావాలి.
- అఖిలపక్షం, ప్రజా సంఘాలు సహకరించాలి.
- జంఝావతి సమస్య పరిష్కారానికి నేతలు కృషి చేయాలి.
- జంఝావతి సాధన సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు.



**పార్వతీపురం, పెన్ సత్తా, ఆగస్ట్ 03:**
గత ఐదు దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్న జంఝావతి సాధన దీక్షలకు సన్నద్ధం కావాలని సాధన సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు పిలుపునిచ్చారు. సోమవారం తన కార్యాలయంలో జంఝావతి సాధన సమితి ప్రతినిధులు పల్లె రాజ్ గోపాల్ నాయుడు, మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు, వంగల దాలినాయుడు, చుక్క పారినాయుడు, వారణాసి శ్రీహరి, మన్యం రామకృష్ణ, బాలు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా జంఝావతి ప్రాజెక్టు రాజకీయ పార్టీలకు ఎన్నికల హామీగా మిగిలింది అన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి గురై గత 50 ఏళ్లుగా రైతులకు పూర్తి స్థాయి 24,640 ఎకరాలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఒడిస్సా వివాదాన్ని సాకుగా చూపించి పాలకులు జంఝావతిని పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టు పూర్తికాక సాగునీరు లేక ఈ ప్రాంత రైతులు వ్యవసాయాన్ని విడిచిపెట్టి పట్టణాలకు కూలి పనుల కోసం వలస పోతున్నారన్నారు. కాబట్టి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సాధించుకునేందుకు రైతులు, రైతు కూలీలు, ప్రజాసంఘాలు, అఖిలపక్ష పార్టీలు, మేధావులు, సామాజిక వాదులు, స్వచ్ఛంద సంస్థలు అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. త్వరలో జంఝావతి సాధన సమితి దీక్షలను జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రాజెక్ట్ పూర్తి పనులు ప్రారంభమయ్యేంతవరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. జిల్లా లోని పాలకులు జంఝావతి ప్రాజెక్టు కోసం కృషి చేయాలన్నారు. దీనికోసం అంత తరలిరావాలని పిలుపునిచ్చారు. త్వరలో కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందన్నారు.

# అర్హులందరికీ నేతన్న సేవలో మంత్రి సవిత.

- ఏటా చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం.
- ఈ నెల 7 నుంచి పథకం అమలు.
- గడువులోగా చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలి.
- ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్న సేవలో అమలు చేస్తున్నాం.
- చేనేతల గౌరవప్రద మైన జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యం.
- పథకం అమలులో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వొద్దు.
- 7 న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు.
- చేనేత, జౌళి శాఖాధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి సవిత.




**అమరావతి, పెన్ సత్తా, ఆగస్ట్ 03:** అర్హులైన వారందరికీ నేతన్న సేవలో పథకం వర్తింప జేస్తామని, చేనేతలకు ఆర్థిక భరోసాతో కూడిన గౌరవప్రద మైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. నేతన్నలకు ఏటా రూ.25 వేలను ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకాన్ని రూపొందించారన్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని శ్రీకారం చుడుతున్నామని, అయిదో తేదీ లోగా అర్హులైన చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సవిత కోరారు. రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేతలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అదే సమయంలో చేనేతలకు వ్యక్తిగతంగా ఆర్థిక వృద్ధి కలిగేలా పలు సంక్షేమ పథకాలను శ్రీకారం చుట్టామన్నారు. 50 ఏళ్లు నిండిన నేతలన్నకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి లబ్ధి కలిగేలా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మగ్గం మీద నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకూ విద్యుత్ ను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఇవే కాకుండా థ్రిఫ్ట్ ఫండ్ నిధులు, ముద్రా రుణాలను కూడా అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. హామీ ఇవ్వకున్నా నేతన్న సేవలో... అమలు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలతో పాటు హామీ ఇవ్వని పథకాలను సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేతకూ ఏడాదికి రూ.25 వేలు అందించనున్నామన్నారు. చేనేత వృత్తిదారులకు ప్రభుత్వ పరంగా అండాలనే ఉద్దేశంతో నూతన పథకానికి శ్రీకారం చుడుతున్నారన్నారు. చేనేత కుటుంబాలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

5 వరకూ దరఖాస్తులకు గడవు:
రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశమని మంత్రి సవిత వెల్లడించారు. ఈ నెల అయిదో తేదీ సాయంత్ర అయిదు గంటల్లోగా అర్హులైన నేతన్నలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఆర్థిక సాయం పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ ఏడీలు నేతన్న సేవలో పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మీడియాలోనూ సమాచారమివ్వాలని, వీలైనంత ఎక్కువ మంది నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్య సాధనలో భాగంగా, విమర్శలకు, ఆరోపణలకు తావులేకుండా నేతన్న సేవలో సథకం అమలయ్యేలా అధికారులు పనిచేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సోసిడియా మాట్లాడుతూ, ఈ నెల ఆరో తేదీ ఉదయానికి అన్ని జిల్లాల నుంచి లబ్ధిదారుల వివరాలు అందజేయాలన్నారు. ఈ నెల ఏడో తేదీన చీరాలలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఆనాటి వేడుకలకు సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. అదే రోజు నేతన్న సేవలో పథకానికి ఆయన శ్రీకారం చుడతారన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ర్యాలీలు, చేనేత వస్త్రాల వినియోగం పై ప్ల కార్డులు కూడా ప్రదర్శించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అన్ని జిల్లాల ఏడీలు, ఆప్కో అధికారులు పాల్గొన్నారు.

# వారం లోనే అంగన్‌వాడీ పోస్టుల ఎంపిక పూర్తి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్.





బాధ్యతాయుతంగా, పారదర్శకంగా సేవలు అందించాలి కలెక్టర్.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 03:** జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. కేవలం ఒకే ఒక్క వారంలోనే ఈ నియామక ప్రక్రియను పూర్తి చేసి, ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ ఈ నెల 20, 23 తేదీలలో నిర్వహించిన ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకులు మొత్తం 170 మందికి నియామక పత్రాలు అందజేశారు. గ్రామీణ స్థాయిలో మాతాశిశు సంక్షేమానికి అంగన్‌వాడీ వ్యవస్థ అత్యంత కీలకమైనదని, ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని బాధ్యతాయుతంగా సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. మాతాశిశు సంక్షేమం, గర్భిణి అయినప్పటి నుండి మాతృమూర్తులకు రక్తహీనత (అనీమియా) రాకుండా చూడటం, ఐదేళ్ల లోపు పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించడం అంగన్‌వాడీల ప్రాథమిక బాధ్యత అన్నారు. సెంటర్లకు వచ్చే పిల్లలకు నాణ్య మైన ఆహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుంటూ పిల్లలు, గర్భిణులకు పోలియో, ధనుర్వాతం వంటి వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందేలా కార్డ్ ఆధారిత రిజిస్ట్రేషన్ మరియు మానిటరింగ్ చేపట్టాలని చెప్పారు. బాల్య వివాహాలు 18 సంవత్సరాల లోపు బాలికలకు పెళ్లిళు జరగకుండా క్షేత్రస్థాయిలో కఠినంగా పర్యవేక్షించాలని, పిల్లల విక్రయాలు లేదా అక్రమ దత్తతలకు తావులేకుండా చూసుకోవాలని, కేవలం ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్ట బద్ధంగా మాత్రమే దత్తత ప్రక్రియలు జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందించే మొబైల్ ఫోన్లలో సంబంధిత యాప్‌ల ద్వారా రోజువారీ హాజరు, బియ్యం, రేషన్ పంపిణీ, సంపూర్ణ పోషణ అమలు వివరాలను ఎప్పటి కప్పుడు పారదర్శకంగా నమోదు చేయాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూచించారు. ఉద్యోగం చాలా వేగంగా, సులభంగా వచ్చిందని నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, స్థానిక ఒత్తిళ్లకు లేదా అవకతవకలకు తావులేకుండా, నిష్పాక్షికంగా ప్రజలకు సేవలు అందించాలని క్రమశిక్షణతో పనిచేసి జిల్లా పేరు నిలబెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీడీపీఓలు, ఇమ్యునైజేషన్ అధికారులు, సిబ్బంది, నూతనంగా ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్ ను తనిఖీ చేసిన బాల కోటయ్య






**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 03:** సోమవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాల కోటయ్య తాళ్లపాలెం లోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినిలతో ఆప్యాయంగా మాట్లాడి వారి విద్య, వసతి, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా బాలకోటయ్య ఉపాధ్యాయులతో మాట్లాడుతూ హాస్టల్ లోని మౌలిక సదుపాయాలు, వసతి ఏర్పాట్లు, ఆహార నాణ్యత, పారిశుధ్యం, త్రాగునీరు, నిర్వహణను పరిశీలించిన బోర్డు చైర్మన్, విద్యార్థినులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
అనంతరం జిల్లాలో అమలవుతున్న సాంఘిక సంక్షేమ పథకాల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరము జిల్లా స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించి సంక్షేమ శాఖ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు అనుగుణంగా సిబ్బంది పని చేయాలని ఈ సందర్భంగా బాల కోటయ్య పేర్కొన్నారు.

# జెన్ జీ టచ్ లో జనసేన




ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసంహరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ వస్తున్నారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుత జెన్ జీ ట్రెండ్‌కి తగినట్లుగా పోరాటాలకు సిద్ధంగా ఉండే నాయకత్వాన్ని తయారు చేయాలని కోరుకుంటున్నారు. కొత్త తరపు గొంతుక పార్టీలో స్పష్టంగా వినిపించాలనే లక్ష్యంతో ఈసారి మరింత ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డ ఆయన కొత్త కమిటీల నియామకం పై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. ఈసారి కేవలం రాజకీయ నాయకులే కాకుండా చదువుకున్న విద్యాధికులతో పాటు ఐటీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు పంపాలని చూస్తున్నారు. వచ్చే నెలలో ఈ కొత్త కమిటీల పూర్తి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ భవిష్యత్తును మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి. దేశ రాజకీయాలను ఇటీవల కాలంలో జెన్ జీ తరహా ఉద్యమాలు ఒక కుదుపు కుదిపేశాయి. ఆ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీలో యువతతో పాటు చదువుకున్న టెక్కీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని సమాచారం అందుతోంది. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులు, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న యువ నాయకులను ప్రోత్సహించి కీలక బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడమే ఈ కొత్త కమిటీల ప్రత్యేకతగా నిలవనుంది. కేవలం సాంప్రదాయ ధోరణులకు పరిమితం కాకుండా నేటి డిజిటల్ యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరుకుంటున్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని, రాబోయే ఎన్నికలలో ఇది పార్టీ విజయానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అంతా భావిస్తున్నారు. మార్పు అనేది ఎప్పుడూ ఒక మంచి పరిణామం అని నమ్మే పవన్ కళ్యాణ్, జనసేన పార్టీలో చేస్తున్న ఈ ప్రక్షాళన భవిష్యత్తు రాజకీయాలకు ఒక దిక్సూచి కానుంది. టెక్నాలజీ యుగంలో దూసుకుపోతున్న నేటి తరానికి తగినట్లుగా పార్టీ యంత్రాంగాన్ని సంస్కరించడం ద్వారా సమాజంలో సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ల మార్గదర్శకత్వంలోనే ఉంటూనే, నిర్ణయాలు తీసుకునే అధికారంలో యువతకు పెద్దపీట వేయడం ఈ కొత్త కమిటీల ప్రధాన ఉద్దేశం. రాబోయే కాలంలో జరగబోయే ప్రతి ఎన్నికను సవాల్‌గా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జనసేన శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. త్వరలో ప్రకటించబోయే కొత్త రాష్ట్ర కమిటీ జాబితా రాజకీయ వర్గాలలో పెను మార్పులకు కారణం కానుంది. పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాలు పార్టీని ఏ విధంగా విజయతీరాలకు చేర్చుతాయనేది వేచి చూడాలి. ఏది ఏమైనా ఈ నిర్ణయం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# మళ్లీ వల్లభనేనికి కోర్టు తిప్పలు



గన్నవరం నియోజకవర్గ రాజకీయాల్లో మట్టి దోపిడీ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అక్రమాలను ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బహిర్గతం చేయడం పెద్ద చర్చకు దారితీసింది. పోలవరం కుడి కాలువ మట్టి తవ్వకాలు, ప్రభుత్వ పనుల కాంట్రాక్టులలో సాగిన అవినీతిని ఆయన బయటపెట్టారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాలనలో జరిగిన ఈ దోపిడీపై విజిలెన్స్ నివేదికలు కూడా స్పష్టమైన నిజాలు వెల్లడించాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కోట్ల విలువైన సహజ వనరులను తరలించారని ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గ ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతతోనే తాను ఈ నిజాలను బయటపెట్టానని యార్లగడ్డ గట్టిగా చెబుతున్నారు. ఈ పరిణామాలు స్థానిక రాజకీయాల్లో పెను మార్పులకు కారణం అవుతున్నాయి. అక్రమాలు బయటపడతాయనే భయంతో మాజీ ఎమ్మెల్యే వంశీ లీగల్ నోటీసుల మార్గాన్ని ఎంచుకున్నారు. తన పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ ఆయన పంపుతున్న నోటీసులు కేవలం భయపెట్టే ప్రయత్నాలని కూటమి శ్రేణులు మండిపడుతున్నాయి. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సాగించిన అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయాక చట్టపరమైన ముసుగులో తప్పించుకోవాలని చూడటం సరికాదని విమర్శకులు అభిప్రాయపడుతున్నాయి. కోర్టుల ద్వారా భయపెట్టి నోరు మూయించవచ్చనే ఆలోచన కేవలం భ్రమేనని స్థానిక నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఇలాంటి బెదిరింపులకు పాల్పడటం మాజీ ఎమ్మెల్యే రాజకీయ బలహీనతను స్పష్టంగా బయటపెడుతోంది. బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధైర్యంగా ప్రకటిస్తున్నారు. చట్టబద్ధంగా ఏ వేదికపైనైనా ఈ దోపిడీని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. కోర్టులకు వెళ్తే అసలు నిజాలు, మట్టి తవ్వకాలకు సంబంధించిన పక్కా ఆధారాలన్నీ బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించింది నియోజకవర్గాన్ని ప్రక్షాళన చేయడానికే తప్ప ఇలాంటి లీగల్ నోటీసులకు భయపడటానికి కాదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం ద్వారా ఆయన తన పట్టును నిరూపించుకుంటున్నారు. ఈ రాజకీయ పోరు రానున్న రోజుల్లో మరింత ముదిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. గన్నవరం నియోజకవర్గ ప్రజలు గత ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలను నిశితంగా గమనించారు. విమానాశ్రయం పరిసరాల్లో జరిగిన పనులలోనూ భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాయల్టీ చెల్లించకుండా తరలించిన వేలాది ట్రక్కుల మట్టి లారీలు రోడ్లను ధ్వంసం చేశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువత ఈ విషయాలను సోషల్ మీడియా వేదికగా విశ్లేషిస్తూ నిలదీస్తున్నారు. పాత తప్పులను కప్పిపుచ్చుకోవడానికి లీగల్ నోటీసులు పంపడం పట్ల ప్రజల్లో వ్యంగ్యమైన చర్చ నడుస్తోంది. అభివృద్ధిని విస్మరించి కేవలం అక్రమ సంపాదన మీద దృష్టి పెట్టడం వల్లే నాయకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని యువత భావిస్తున్నారు. ఈ పరిణామాలు రాబోయే రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. మొత్తానికి గన్నవరం రాజకీయం ప్రస్తుతం అత్యంత రసవత్తరమైన దశకు చేరుకుంది. యార్లగడ్డ వెంకట్రావు దూకుడు వల్ల వంశీ వర్గంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అవినీతిని అంతం చేసే వరకు విశ్రమించేది లేదనే సంకేతాలను ప్రస్తుత నాయకత్వం బలంగా ఇస్తోంది. సోషల్ మీడియా ట్రెండ్స్ ప్రకారం చూస్తే ఈ వివాదం ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ప్రజలు కూడా నిజాలు ఎటువైపు ఉన్నాయో స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. రానున్న కాలంలో ఈ పోరు కోర్టుల ద్వారా ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. గన్నవరం అభివృద్ధి సాధించాలంటే ఇలాంటి అక్రమాలపై నిరంతరం నిఘా అవసరమని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# పోతిన మహేష్ దారెటు...

పోతిన మహేష్ ప్రస్తుతం వైసీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న యువ నాయకుడు. విజయవాడ రాజకీయాల్లో ఎదగాలని ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆయనకు మంచి పట్టు ఉంది. జనసేన పార్టీ ద్వారా రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. పవన్ కల్యాణ్ వీరాభిమానిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన రాజకీయ భవితవ్యం సంకటంలో పడింది. గత ఎన్నికలలో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆశించారు. కూటమి పొత్తులో భాగంగా ఈ స్థానం బీజేపీకి కేటాయించారు. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. జనసేన పార్టీ వీడి వైసీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ ఆయనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. భవిష్యత్తు రాజకీయాలపై ఆయన మదనపడుతున్నారు. విజయవాడ పశ్చిమ సీటుపై పోతిన మహేష్ భారీ ఆశలు పెట్టుకున్నారు. గడచిన ఎన్నికలలో టికెట్ రాలేదు. ఇప్పుడు కూడా అదే సీటు కోరుకుంటున్నారు. అయితే వైసీపీలోనూ బలమైన నాయకులు ఉన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మళ్లీ అదే స్థానం ఆశిస్తున్నారు. దీంతో పోతిన మహేష్ పరిస్థితి క్లిష్టంగా మారింది. పార్టీ అధిష్టానం ఆయనకు గుంటూరు పార్లమెంట్ బాధ్యతలు అప్పగించింది. ఆ బాధ్యతల పట్ల ఆయన పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తనకు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ పదవి కావాలని కోరుతున్నారు. పార్టీ పెద్దలు ఆయన డిమాండ్ పట్టించుకోవడం లేదు. సొంత పార్టీలో తగిన గుర్తింపు లభించక సతమతమవుతున్నారు. వైసీపీలో తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో జనసేన నుంచి సంకేతాలు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోతిన కోసం జనసేన తలుపులు తెరిచే ఉన్నాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆయనను తిరిగి పార్టీలోకి ఆహ్వానించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే గతంలో పవన్ కల్యాణ్ కుటుంబంపై పోతిన తీవ్ర విమర్శలు చేశారు. ఈ పరిణామం జనసేనలోని కొందరికి నచ్చడం లేదు. ఆయనను మళ్లీ పార్టీలో చేర్చుకోవడాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు. పార్టీలో ఆయనకు స్థానం దక్కడం కష్టమని కొందరు నేతలు భావిస్తున్నారు. ఈ రాజకీయ పరిణామాలు ఆయనను తీవ్ర గందరగోళంలో నెట్టేశాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు గమనిస్తే పోతిన మహేష్ అడకత్తెరలో చెక్కపడ్డ చందంగా మారారు. వైసీపీలో ఉంటే పశ్చిమ సీటు దక్కేలా లేదు. జనసేనకు వెళితే గత విమర్శల కారణంగా వ్యతిరేకత ఎదురవుతోంది. రెండు పార్టీల మధ్య నలిగిపోతున్న ఆయన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విజయవాడ రాజకీయాల్లో తన స్థానం సుస్థిరం చేసుకోవాలని ఆయన తపన పడుతున్నారు. కానీ పరిస్థితులు ఆయనకు అనుకూలంగా మారడం లేదు. అనుచరులు మాత్రం ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే మరింత నష్టపోవాల్సి వస్తుంది. రాజకీయ ప్రయోజనాలు నెరవేరక పోవడంతో పోతిన మహేష్ తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ప్రత్యర్థుల వ్యూహాల కారణంగా ఆయన నియోజకవర్గంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రజల్లోకి వెళ్దామంటే స్పష్టమైన హామీలు కరువయ్యాయి. భవిష్యత్తు కార్యాచరణపై సన్నిహితులతో చర్చిస్తున్నారు. ఏ పార్టీలో కొనసాగాలనేదానిపై త్వరలోనే స్పష్టత ఇస్తారని ప్రచారం జరుగుతోంది. విజయవాడ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ తరుణంలో ఆయన ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి. మొత్తంగా ఆయన రాజకీయం అత్యంత కీలకమైన మలుపు తిరిగింది.

## కష్ట కాలంలో మిత్ర పక్షం: మోడీకి ఇది అవసరం.. !



ప్రస్తుతం దేశవ్యాప్తంగా నెలకొన్న కొన్ని రాజకీయ పరిణామాలు.. ముఖ్యంగా విద్యార్థి నిరసనలు వంటివి ప్రధాని మోడీకి ఇబ్బందికరంగా మారుతున్నాయి. నీట్ పరీక్ష పేపర్ లీక్ సహా.. అయోధ్య రామయ్య మం దిర విరాళాల చోరీ ఘటన వంటివి రాజకీయాలకు అతీతంగా ప్రజల్లో నిరసనలకు దారి తీశాయి. ఇవి ఒక్క వర్గానికి.. లేదా ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని వర్గాల వారూ.. రాముడికి విరాళాలు ఇచ్చారు. దీంతో ఈ రెండు విషయాలలో జరిగిన తప్పులు.. సహజంగానే కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బందిగా మారాయి. ఎన్నడూలేని విధంగా ఒక నిరసన కారణంగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సి వచ్చింది. అయోధ్య రామమందిర ట్రస్టును మార్చుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ.. జాతీయస్థాయిలో మోడీ సర్కారుకు తీవ్రసంకటంగా పరిణమించాయి. మరోవైపు ప్రధాని, హోం శాఖ మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లుతున్నాయి. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో మోడీని సమర్థించే వారు అవసరం. మోడీని మెచ్చుకునేవారు.. ఆయనకు అండగా ఉండే వారు.. అత్యంత అవసరం. ఖచ్చితంగా ఇదేసమయంలో ఏపీ నుంచి మోడీకి బలమైన మద్దతు లభించింది. భోగాపురం వేదికగా టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు.. ఆయనకు అండగా నిలిచారు. ప్రధానికి మద్దతుగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన ఈ దేశానికి అందివచ్చిన వరమని ప్రశంసలు గుప్పించారు. పైకి చూస్తే.. ఇవి పొగడ్తలుగా అనిపించినా.. కేంద్రం దృష్టిలోను, ముఖ్యంగా ప్రధాని దృష్టిలోను.. ఈ కీలక క్లిష్ట సమయంలో ఆయనకు చంద్రబాబు, పవన్ అందించిన బూస్ట్ అంతా ఇంతా కాదు. దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతున్నట్టు అంచనా వేసుకుంటున్న సమయంలో అనూహ్యంగా వీరిద్దరూ మద్దతు ప్రకటించడం.. కేంద్ర ప్రభుత్వానికి దన్నుగా మారింది. పైగా.. దక్షిణాదిలో బలమైన రెండు ప్రాంతీయ పార్టీల నుంచి మద్దతు కూడగట్టడం ద్వారా.. ఈ సమయంలో ప్రధానికి బిగ్ రిలీఫ్ వచ్చినట్టు అయిందని అంటున్నారు పరిశీలకులు.

### కంచుకోటలో సవాళ్లు....

ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ కి కంచు కోటగా గుర్తింపు పొందింది. రాజకీయ పరిస్థితులు ఎలా మారినా ఈ ప్రాంతంలో పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకుంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసినప్పటికీ, హిందూపురం , ఉరవకొండ వంటి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు సాధించింది. 2024 ఎన్నికల్లో కూడా జిల్లా వ్యాప్తంగా పార్టీ మరింత బలపడింది. అయితే ఇప్పుడు జిల్లాలో పార్టీ నాయకత్వం ఆశించినంత చురుకుగా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇటీవల రాజకీయ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదని కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది. మంత్రి పదవులు లేదా ఇతర కీలక బాధ్యతలు ఆశించిన కొందరికి అవి దక్కకపోవడం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం జరగడం వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయనే ప్రచారం ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వం తమ తమ వర్గాలకే పరిమితమవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు ఒకే దిశగా సాగడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం బలహీనంగా ఉండటం వల్ల కేడర్‌లో కూడా కొంత నిరుత్సాహం కనిపిస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన ఇంటింటికీ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో అమలు చేయడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ , కాల్వ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం కొంత చురుకుగా సాగుతున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదని పార్టీ వర్గాలే అంటున్నాయి. చాలా చోట్ల ఇంటింటికీ కార్యక్రమం కంటే సమావేశాలు, సమన్వయ చర్చలు, కార్యకర్తల నియామకాలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల్లో పార్టీ కార్యక్రమాల ప్రభావం తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది సీనియర్ నాయకులు ఉండటం కూడా సమన్వయానికి సవాలుగా మారిందని అంటున్నారు. ప్రతి నాయకుడు తన రాజకీయ ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉండటంతో కొన్ని చోట్ల అంతర్గత పోటీ పెరిగినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల మధ్య అభిప్రాయ భేదాలు కూడా అప్పుడప్పుడు బయటపడుతున్నాయని సమాచారం. ముఖ్యంగా తాడిపత్రి, హిందూపురం , పెనుకొండ వంటి కీలక నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఈ పరిస్థితులను పార్టీ అధిష్ఠానం సమయానికి చక్కదిద్ది, నాయకత్వం మరియు కేడర్‌ను ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడం టీడీపీకి అత్యంత కీలకమైన అంశంగా మారింది.

### పరారీలో వైసీపీ నేతలు

ఆంధ్రప్రదేశ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలలో కనిపిస్తున్న భయం, ఆందోళన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయి కేసులు మూటగట్టుకున్న నాయకులు.. ఇప్పుడు విచారణను ఎదుర్కొనే ధైర్యం లేక చాంతాడంత పొడవునా పరారీలో ఉంటున్నారు. ఎక్కువ మంది కొత్త కేసుల్లోనే ఇరుక్కుంటున్నారు. కనిపించకుండా పోతున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు మద్యం రవాణా టెండర్ల అక్రమాల కేసులో సుప్రీంకోర్టు నుంచి ముందస్తు బెయిల్ రాక తీవ్ర షాక్ తగలడం, చింతాడ రవికుమార్, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వంటి వారు ఎక్కడ ఉన్నారో తెలియక అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఈ సిరీస్‌లో తాజా పరిణామాలు. తమ్మినేని వంటి కొందరు నేతలు అత్యంత ప్రయాస పడి మధ్యంతర బెయిల్ తెచ్చుకుంటుంటే.. మిగిలిన వారంతా పోలీసుల భయంతో దిక్కుతోచని స్థితిలో నక్కి నక్కి బతుకుతున్నారు. అసలు ఇక్కడ విచిత్రమేమిటంటే.. పోలీసులు వీరిని అరెస్ట్ చేయడానికి పెద్దగా ప్రత్యేక వేట ఏమీ సాగించడం లేదు. అయినప్పటికీ, తమ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోనన్న భయంతో ఫోన్లు కూడా వాడకుండా, రహస్య స్థావరాల్లో దాక్కుంటూ నేతలే సొంతంగా నరకం అనుభవిస్తున్నారు. ఈ ఆధునిక డిజిటల్ యుగంలో ఫోన్ లేకుండా, పరివారానికి దూరంగా, నిరంతరం పోలీసుల సైరన్ వినపడితే ఉలిక్కిపడుతూ అజ్ఞాతంలో గడపడం ఏ రాజకీయ నాయకుడికైనా తీవ్రమైన మానసిక వేదన. ముందస్తు బెయిల్ ఇప్పించాలంటూ కోర్టుల చుట్టూ లాయర్లతో పిటిషన్లు వేయిస్తూ, రోజులు లెక్కిస్తూ బతకడం కంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదు. వైసీపీ నాయకత్వం గానీ, ఈ పరారీలో ఉన్న నేతలు గానీ అర్థం చేసుకోవాల్సిన ప్రధానమైన అంశం ఒకటుంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నిందితులు ఎంతకాలం పారిపోగలరు? ఎక్కడో ఒకచోట ఫోన్ వాడినా, డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసినా లేదా మూడో వ్యక్తితో మాట్లాడినా పోలీసులు సులభంగా ట్రాప్ చేయగలరు.

# క్రీడారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి
- క్రీడలు శారీరక దృఢత్వంతో , మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయి
- అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి
- ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్







క్రీడారంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ఆముదాలవలస గౌరవ శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు శిక్షణా అవకాశాలను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించి, క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో ఆడి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు, క్రీడాశాఖ అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పారదర్శక పాలన








- ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులకు ప్రభుత్వం కృషి
- అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా సంక్షేమ పథకాలు
- గ్రామీల ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత
- వ్యవసాయ రంగంలో గణనీయమైన పురోగతి
- గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పనలు ప్రత్యేక శ్రద్ధ
- ఆమదాలవలస ఎమ్మెల్యే రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన సాగిస్తోందని ఆమదాల వలస ఎమ్మెల్యే , రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ అన్నారు.ఆమదాలవలస మండలంలో అక్కుల పేట గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం సంక్షేమ విజయాలు ప్రజా పాలన ఇంటింటికీ అభివృద్ధి" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.అనంతరం ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని తెలిపారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోంద న్నారు. అక్కుల పేట గ్రామంలో కూడా వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు.గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధాని వీడియో తొలగింపునకు జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి






ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక ఫేస్?బుక్? పోస్టు తొలగింపు వ్యవహారంపై కమ్యూనికేషన్స్, ఐటీ పార్లమెంటరీ స్థాయీ కమిటీ తీవ్రంగా స్పందించింది. పది రోజుల్లోగా తమ వైఖరిని లిఖితపూర్వకంగా స్పష్టం చేయాలని పార్లమెంటరీ ప్యానెల్ సోమవారం మెటాను కోరింది. దీనిపై మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని ప్యానెల్ ఛైర్మన్? నిషికాంత్ దుబే సోమవారం అన్నారు. కాగా, మెటా బాధ్యతను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు ఇతర సభ్యులు డిమాండ్ చేశారు.

సామాజిక, డిజిటల్ వేదికలు- వాటి నియంత్రణ' అనే అంశంపై చర్చించేందుకు బీజేపీ సభ్యుడు దుబే నేతృత్వంలోని కమిటీ ఈ సమావేశం నిర్వహించింది. ఈ పార్లమెంటరీ ప్యానెల్ సమావేశం మూడు గంటలకు పైగా జరిగింది. కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మీవత్) కార్యదర్శి ఎస్. కృష్ణన్, స్నాప్‌చాట్, గూగుల్, ఎక్స్, మెటా (ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్), యూట్యూబ్ వంటి సామాజిక, డిజిటల్ మీడియా వేదికల ప్రతినిధులు కమిటీ ముందు హాజరయ్యారు.


"ప్రధాని వీడియోను ఎందుకు తొలగించారు? ఇందుకు ఎవరు అనుమతి ఇచ్చారు? అభ్యంతరకరమైన ఇతర కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అలాగే ఉంచి ఈ వీడియోపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకున్నారు?" అని మెటా అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో పొరపాటు జరిగిందని మెటా అధికారులు క్షమాపణలు చెప్పారు. అయితే, క్షమాపణలు చెబితే సరిపోదని బాధ్యత వహించాలని ఎంపీలు చెప్పినట్లు తెలుస్తోంది. వీడియోను తాత్కాలికంగా తొలగించడానికి కారణమైన మెటా అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేసినట్లు సమాచారం. తమ ప్లాట్‌ఫారమ్‌లలో ఉన్న వివాదాస్పద, అభ్యంతరకరమైన కంటెంట్‌పై కంపెనీ తీసుకున్న చర్యల వివరాలను కూడా మెటాను సభ్యులు కోరినట్లు తెలుస్తోంది. మెటా భారతదేశం నుంచి భారీ ఆదాయాన్ని సంపాదిస్తున్నప్పటికీ, ఈ దేశ చట్టాలను పాటించడం లేదని ఎత్తి చూపారు. సోషల్ మీడియాలో అసమ్మతికి చోటు ఉండటం తప్పనిసరి అని, ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్‌ను దేశద్రోహంగా పరిగణించకూడదని ప్యానెల్‌లోని ప్రతిపక్ష ఎంపీలు అన్నట్లు తెలుస్తోంది.

"ఆ వీడియోను ఐదు గంటల పాటు తొలగించినట్లు వారే (మెటా) అంగీకరించారు. రాత్రి 12:30 నుంచి ఉదయం 5:00 గంటల వరకు అది అందుబాటులో లేకుండా పోయింది. ఇది చాలా తీవ్రమైన విషయం. ఇలా మెటా ఒక వీడియోను తొలగించడం ఇది మొదటిసారి కాదు. 2024లో మార్క్ జుకర్‌బర్గ్ పార్లమెంటరీ ఎన్నికల ఫలితాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని అస్థిరపరచడమే వారి మనస్తత్వం. ప్రధానమంత్రి వీడియోను ఐదు గంటల పాటు తొలగించారు. వారు హోం వ్యవహారాలు, ఐటీ మంత్రిత్వ శాఖల ఆదేశాలను వినరు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియోను తొలగించినందుకు మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలి. ఒకవేళ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పకపోతే, సెక్షన్ 79 కింద వారికి ఉన్న సేఫ్ హార్బర్ రక్షణను వెనక్కి తీసుకోవాలి." అని దుబే అన్నారు. సమాచార సాంకేతిక చట్టంలోని ఈ నిబంధన ప్రకారం, సోషల్ మీడియా నెట్‌వర్క్‌లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు తమ ప్లాట్‌ఫారమ్‌లోని థర్డ్-పార్టీ కంటెంట్‌కు చట్టపరంగా బాధ్యత వహించరు.

**ఇంతకీ ఏం జరిగింది?**

నీట్?- యూజీ 2026 పరీక్షల అక్రమాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు దిల్లీలోని జంతర్ మంతర్? వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలోనే జులై 23న ప్రధాని మోదీ మొదటిసారిగా నేరుగా యువతను ఉద్దేశించి ఫేస్?బుక్? వేదికగా మాట్లాడారు. అందులో పరీక్ష పేపర్ లీకేజీలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకోసం మరింత కఠినమైన చట్టపరమైన నిబంధనలను కేంద్ర మంత్రివర్గం ముందుకు తీసుకువస్తామని తెలిపారు. అయితే ఫేస్?బుక్? జులై 28 తెల్లవారుజామున ఈ వీడియో యాక్సెస్?ను కొద్దిసేపు నిలిపివేసింది. ఫలితంగా మోదీ పెట్టిన వీడియో పోస్టు కనిపించకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ చర్యను తీవ్రంగా పరిగణించింది. ప్రధాని మోదీ పోస్టు ఎందుకు తొలగించారో చెప్పాలంటూ, మెటా గ్లోబల్ పబ్లిక్? పాలసీ హెడ్?కు ఐటీ మంత్రిత్వశాఖ సమన్లు జారీ చేసింది. దీంతో దిగి వచ్చిన మెటా కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణ చెప్పింది. "ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను పొరపాటున తొలగించడం జరిగింది. ప్రస్తుతం దీనిని తిరిగి పునరుద్ధరించాం" అని మెటా ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇక్రిశాట్‌కు క్రిస్పర్ కాస్9 సాంకేతికత!



ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని చిన్న, సన్నకారు రైతుల ఆహార భద్రత, వాతావరణ మార్పులను తట్టుకునే సరికొత్త జన్యు సవరణ వంగడాల రూపకల్పన దిశగా హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) ఒక చరిత్రాత్మక మైలురాయిని సాధించింది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన జన్యు సవరణ (జీన్ ఎడిటింగ్) పరిజ్ఞానమైన 'క్రిస్పర్ కాస్9'ను సుదీర్ఘకాలం పాటు ఉపయోగించుకునేందుకు అమెరికా కంపెనీల నుంచి ఇక్రిశాట్ తాజాగా హక్కులు పొందింది. క్రిస్పర్ కాస్9 సాంకేతికతపై ప్రధాన పేటెంట్లు అమెరికా సంస్థలకు ఉన్నాయి. మన దేశంలో శాస్త్రవేత్తలు పరిశోధనల స్థాయిలో ప్రయోగశాలల్లో దీన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, దాని ఆధారంగా రూపొందించిన జన్యుమార్పిడి విత్తనాలను వాణిజ్యపరంగా రైతుల వద్దకు తీసుకెళ్లటానికి అత్యధిక లైసెన్సింగ్ రుసుం చెల్లించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో క్రిస్పర్ కాస్9 జన్యుసవరణ సాంకేతికత సొంతదారులైన అమెరికా సంస్థలు కోర్టేవా అగ్రిసైరీన్స్, బ్రాడ్ ఇరీన్‌స్టిట్యూట్‌లు మానవతా దృక్పథంతో ఇక్రిశాట్‌కు ఉచితంగా దీర్ఘకాలిక లైసెన్స్ ఇవ్వటం విశేషం. తద్వారా ఎలాంటి పేటెంట్ వివాదాలు లేకుండా, అతి తక్కువ ఖర్చుతో ఇక్రిశాట్ పరిశోధనలు పూర్తి చేసేందుకు, లైసెన్సింగ్ రుసుము నుంచి మినహాయింపు పొందేందుకు అవకాశం ఏర్పడింది. ఇదో మైలురాయి: ఇక్రిశాట్ డీజీ: ఈ ఒప్పందం ద్వారా అభివృద్ధి చేసే పంటల విత్తనాలపై పేటెంట్ భారం ఉండదు కా బట్టి, ఆసియా, ఆఫ్రికాలోని పేద రైతులకు వాతావరణ మార్పు ల వల్ల సంభవించే అనావృష్టి, తీవ్రమైన కరువు, కొత్త రకం తెగుళ్లను తట్టుకునే కంది, శనగ, వేరుశనగ, జొన్న, సజ్జ, ఇతర చిరుధాన్యాలకు సంబంధించి సరికొత్త జన్యుసవరణ విత్తనాలు అతి తక్కువ ధరలోనే అందుబాటులోకి వస్తాయి. 'ఈ ఒప్పందం ఇక్రిశాట్‌కు, మెట్ట వ్యవసాయంపై ఆధారపడిన లక్షలాది మంది చిన్న రైతులకు, వారి కుటుంబాలకు ఒక పరివర్తనాత్మక మానవతా మైలురాయి' అని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్ సోమవారం ఒక ప్రకటనలో అభివర్ణించారు. కాగా సాధారణ సాంప్రదాయ పద్ధతిలో వాతావరణ మార్పుల ను తట్టుకునే కొత్త పంట రకాన్ని తయారు చేయటానికి 10--15 ఏళ్లు పడుతుందని, ఈ ఒప్పందం ద్వారా క్రిస్పర్ కాస్9ను నేరుగా వాడటం వల్ల 3--5 సంవత్సరాల్లోనే కొత్త వంగడాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## 19 మందితో కర్ణాటక మంత్రివర్గ విస్తరణ




బెంగళూరు: కర్ణాటకలో ఆశావహులు ఎంతో ఆశతో ఎదురు చూసిన మంత్రివర్గ విస్తరణ ఎట్టకేలకు జరిగింది. బెంగళూరు లోక్‌భవన్‌లో సోమవారం సాయంత్రం 19 మంది కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. జూన్ 3వ తేదీన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎప్పటికప్పుడు మంత్రివర్గ విస్తరణ పెండింగ్‌లో పడుతూ వచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ అందడంతో కేబినెట్ విస్తరణకు మార్గం సుగమం అయింది. జూన్ 3న ముఖ్యమంత్రిగా డీకే ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు అదే రోజు మొత్తం 13 మంది నూతన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో సహా మొత్తం మంత్రివర్గ సభ్యుల సంఖ్య 33కు చేరింది. సిద్ధరామయ్య మంత్రివర్గ సభ్యుల సంఖ్య 34 కావడం గమనార్హం. కాగా సిద్ధరామయ్య మంత్రివర్గంలో ఉన్న దాదాపు 19 మంది డీకే మంత్రివర్గంలో స్థానం సంపాదించుకోవడం గమనార్హం. సీనియారిటీ, పలుకుబడికి జాబితాలో ప్రాధాన్యత లభించినట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలా తదితరులు పాల్గొన్నారు. తాజా మాజీ సీఎం సిద్ధరామయ్య, బీజేపీ, జేడీఎస్ నేతలు గైర్హాజరయ్యారు.

**చివరి క్షణంలోనూ మార్పులు.. చేర్పులు**

తాజామంత్రివర్గ విస్తరణ జాబితాలో తొలుత ఒక మహిళ పేరు ఉన్నప్పటికీ.. అటు తర్వాత వేరొకరితో ఆ స్థానాన్ని భర్తీ చేయడం గమనార్హం. దీనితో డీకే మంత్రివర్గంలో మహిళలకు ప్రాతినిధ్యం దక్కని పరిస్థితి నెలకొంది. చివరి మూడు గంటల్లోనే మూడు సార్లు మంత్రులు, స్పీకర్ అభ్యర్థుల జాబితా మారడం గమనార్హం. తొలి జాబితాలో చోటు దక్కించుకున్న ఎమ్మెల్సీ గాయత్రీ శాంతేగౌడను చివరి నిమిషంలో తప్పించి తాజా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బోసురాజుకు అవకాశం ఇచ్చారు. అలాగే తొలి జాబితాలో మహంకాళు వైద్య పేరు ఉంటే, దీనిని తొలగించి తాజా మాజీ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్‌తో భర్తీ చేశారు. తమకు తాజా విస్తరణలో చోటు లభించకపోవడంతో పలువురు సీనియర్లు, ఆశావహులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కొందరు ఏకంగా శాసన సభ్యత్వానికే రాజీనామా సమరి?పస్తామని బెదిరించే వరకూ పరిస్థితి వెళ్లింది. అయితే అసమ్మతిని సహించబోమని అధిష్టానం స్పష్టం చేసింది.

**కొత్తగా మంత్రివర్గంలో చేరిన 19 మంది మంత్రులు..**

1. డాక్టర్ అజయ్‌సింగ్, 2. హెచ్‌సీ బాలకృష్ణ, 3. కేఎస్ బసవంతప్ప, 4. బసవ రాజరాయరెడ్డి, 5. ఎన్.చలువరాయస్వామి, 6. లక్ష్మణ సవది, 7. సొరెకొప్ప మధు బంగారప్ప, 8. ఎస్ఎస్.మల్లికార్జున్, 9. బి.నాగేంద్ర, 10. నరేంద్ర స్వామి, 11. పుట్టరంగశెట్టి, 12. టి.రఘుమూర్తి, 13. రిజ్వాన్ అర్షద్, 14. రుద్రప్ప లమాణి, 15. సంతోష్ ఎస్.లాడ్, 16. కేఎం శివలింగేగౌడ, 17. శివరాజ్ తంగడగి, 18. విజయానంద కాశప్పనవర్, 19. జమీర్ అహ్మద్‌ఖాన్

## సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న మొత్తం 34 మంది న్యాయమూర్తుల సంఖ్యను 38కు పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. దీంతో ఈ ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. లోక్‌సభ సమావేశం ప్రారంభమైనప్పటి నుంచే ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు.

## సంపాదకీయం

# శాంతికోసం భారత్!

మనం ప్రస్తుతం మూడో ప్రపంచ యుద్ధం మధ్యలో ఉన్నామా? అనే ప్రశ్న విశ్లేషకుల చర్చల్లో తలెత్తుతోంది. ఐరోపాలో మొదలైన యుద్ధం ఇప్పుడు ఉత్తర కొరియా బలగాలు రంగంలోకి దిగడం, రష్యాకు చైనా మద్దతు కొనసాగించడంతో యురేషియా స్థాయి సంఘర్షణగా విస్తరించింది. పశ్చిమ ఐరోపా, అమెరికా మద్దతుతో ఉక్రెయిన్ ఇంకా పోరాటంలో నిలదొక్కుకుంటోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టి మళ్లినప్పుడల్లా తీవ్రతరమయ్యే పశ్చిమాసియా సంఘర్షణ అనేక దేశాలను తనలో లాగేసుకుంది. లాటిన్ అమెరికాలో వెనెజువెలాపై అమెరికా సైనిక ఉనికిని నెలకొల్పడం, క్యూబాపై దిగ్బంధనం విధించడం గమనార్హం. ఆఫ్రికాలోనూ ఉత్తర, తూర్పు ప్రాంతాలు ఏదోక సంఘర్షణలో చిక్కుకున్నాయి. భారత్‌కు తూర్పున ప్రస్తుతానికి యుద్ధం లేకపోయినా, ఈ ప్రాంత దేశాలు రెండు ప్రధాన సంఘర్షణల్లోకి పరోక్షంగా లాగబడుతున్నాయి. ఉత్తర కొరియా ప్రత్యక్షంగా చేరగా, జపాన్ నాటో మిత్రదేశంగా నిలిచింది, పాకిస్థాన్ పశ్చిమాసియా సంఘర్షణలో అనేక రకాలుగా ఇమిడిపోయింది. హిందూ మహాసముద్ర ప్రాంతంలోకి అమెరికా యుద్ధనౌకలు ప్రవేశించడం, ఈ రెండు ప్రధాన యుద్ధాల్లో భారతీయులు మరణించడంతో మనదేశం కూడా పరోక్ష నష్టాన్ని చవిచూసింది. అయితే, మొదటి రెండు ప్రపంచ యుద్ధాలతో పోలిస్తే ఇప్పటి పరిస్థితిని పోల్చడం సరికాదు. అప్పుడు ప్రత్యర్థి దేశాల సైన్యాలు నేరుగా తలపడి, కోట్లాది మంది ప్రాణాలు కోల్పోయారు. నగరాలు నేలమట్టమయ్యాయి. ఇప్పటి సంఘర్షణల్లో ప్రత్యక్ష విధ్వంసం ఆయా దేశాలకే పరిమితమైనా, ఇంధనం, ఆహార ధరల పెరుగుదల, ప్రపంచ వాణిజ్య అంతరాయాల రూపంలో ఆర్థిక మూల్యాన్ని యావత్ ప్రపంచం చెల్లిస్తోంది. జీ7 దేశాలు ఆర్థిక వ్యవస్థ, ఇంధనం, వాణిజ్యాన్ని ఆయుధాలుగా మలచుకోవడంతో.. భారత్‌తో సహా అనేక దేశాల పౌరులు సంఘర్షణ ప్రాంతాల్లో ఉపాధి కోసం చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నారు.


భారత్‌కు తూర్పు, ఆగ్నేయాసియా ప్రాంతాల్లో ఇప్పటికీ సాపేక్ష శాంతి నెలకొని ఉంది, తైవాన్ జలసంధిలో చైనా కూడా ప్రస్తుతానికి సంయమనం పాటిస్తోంది. అయినప్పటికీ, ఈ ప్రాంత దేశాలు రక్షణ వ్యయాన్ని, యుద్ధ సన్నద్ధతను గణనీయంగా పెంచుకుంటున్నాయి. ట్రంప్ వాణిజ్య దాడిని, విస్తృత ఆంక్షల విధానాన్ని ఎదుర్కొంటూనే, భారత్ అమెరికాతో పాటు రష్యాతోనూ రక్షణ సంబంధాలను కొనసాగిస్తోంది. రక్షణ వ్యయాన్ని పెంచుకోవడంతో పాటు, యుద్ధంలో పాలుపంచుకుంటున్న ఇజ్రాయెల్‌కు ఆయుధాలు విక్రయిస్తూ, వివిధ ఆసియా దేశాలకు బ్రహ్మోస్ క్షిపణులను ఎగుమతి చేస్తూ భారత్ తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోంది. గతంలో రెండు ప్రపంచ యుద్ధాల్లో బ్రిటిష్ సామ్రాజ్యం తరపున భారతీయ సైనికులు ఐరోపా, ఆసియా యుద్ధభూముల్లో ప్రాణాలర్పించారు. నేడు భారత సైనికులు నేరుగా యుద్ధరంగంలో లేకపోయినా, ఈ రెండు యుద్ధాల పర్యవసానంగా భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరీ ముఖ్యంగా, ఇంధనం, ఆహార ధరల పెరుగుదల, సరఫరా అంతరాయాలు, తయారీ–సేవల రంగాలకు ప్రపంచ డిమాండ్ తగ్గడం వంటివి భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయి. పెద్దనోట్ల రద్దు, కోవిడ్–19 మహమ్మారి పరిణామాల నుంచి ఇంకా పూర్తిగా కోలుకోని భారత్, ఇప్పుడు ఈ రెండు యుద్ధాల భారాన్నీ మోస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ రెండు సంఘర్షణలనూ ముగించడంలో భారత్‌కు గణనీయమైన వాటా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ఒకప్పుడు 'ఇది యుద్ధాల యుగం కాదు' అని ప్రముఖంగా ప్రకటించారు. అయితే ఉభయ సంఘర్షణల్లోనూ ఇరు వర్గాలతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండటంవల్ల, జోక్యం చేసుకుని మార్పు తీసుకురాగల భారత సామర్థ్యం పరిమితమైంది. రష్యాతో సంబంధాలు యూరోపియన్ యూనియన్, అమెరికాతో సంబంధాల మాదిరిగానే భారత్‌కు కీలకం –ఉక్రెయిన్ అంశం అంతగా ప్రాధాన్యత లేనిదిగా మిగిలింది. పశ్చిమాసియాలోనూ అన్ని పక్షాలతో సంబంధాలు కొనసాగించడంలోనే భారత్ ప్రయోజనం ఇమిడి ఉంది.

ప్రస్తుతం భారత్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో శాశ్వతేతర సభ్యత్వం కోసం 2028–29 కాలానికి అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. ఈ దశలో ఇంత ఆలస్యంగా బరిలోకి దిగడానికి కారణం స్పష్టంగా లేకపోయినా, ఈ అవకాశాన్ని భారత్ ప్రపంచ శాంతి కార్యకర్తగా తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి వినియోగించుకోవచ్చని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. ఉక్రెయిన్, గల్ఫ్ సంఘర్షణలు రెండింటినీ ముగించే దిశగా ప్రపంచ దేశాల కూటమిని నిర్మించే దార్శనికతను భారత నాయకత్వం ముందుకు తేగలదా అన్నది ప్రశ్న. అదే సమయంలో, అమెరికా, రష్యా, చైనావంటి ప్రధాన శక్తులు తమ పరిసర ప్రాంతాల్లో అంతర్జాతీయ చట్టాన్ని, ఐరాస చార్టర్‌ను గౌరవించాలని కూడా భారత్ నొక్కి చెప్పాల్సిన అవసరముంది. ఈ ఏడాది సెప్టెంబర్ 12–13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సదస్సుకు హాజరుకానున్నారని వార్తలొస్తున్నాయి. రష్యా, ఇరాన్‌లు యుద్ధాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నా, మిగతా బ్రిక్స్ దేశాలన్నింటికీ మరింత శాంతియుత, స్థిరమైన ప్రపంచ వాతావరణంలోనే ప్రయోజనం ఉంది.

భారత నాయకత్వం ప్రపంచ శాంతికి ఒక దార్శనికతను ప్రతిపాదించి, ఉక్రెయిన్–గల్ఫ్ సంఘర్షణలు రెండింటినీ ముగించాలని కోరుకునే దేశాల కూటమిని నిర్మించగలదా? ఇది సాధ్యం కావాలంటే, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లోని అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో కలిసి పనిచేయడంతో పాటు, ప్రపంచ పౌరుడిగా భారత్ తనను తాను పునర్నిర్వచించుకోవాల్సి ఉంటుందని కొందరి అభిప్రాయం. తన పౌరులను వేధించే, భయపెట్టే దేశంగా కాకుండా.. ప్రజాస్వామిక, ఉదారవాద విలువలపై నిబద్ధతే 1950–60ల్లో భారత రాజకీయ నాయకత్వానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిపెట్టింది. దేశీయ రాజకీయాల్లో వచ్చిన కొత్త మలుపుల కారణంగా భారత ప్రయోజనాలపై ప్రపంచం క్రమంగా అంత సానుకూలంగా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇది అందరూ ఏకీభవించే అంశం కాదు. ఏదేమైనా, పెరుగుతున్న ఆర్థిక, రక్షణ శక్తితో పాటు, శాంతి కోసం స్పష్టమైన గొంతుకగా నిలవడం ద్వారానే భారత్ ప్రపంచ వేదికపై తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకోగలదన్నది నిర్వివాదాంశం.

---

## పనికొచ్చే పలుకు



# దేన్ని మార్చగలరో దాన్నే పట్టుకోండి!

జీవితంలో ఎన్నో సందర్భాల్లో మనం జరిగిపోయిన తప్పులు, ఇతరుల ప్రవర్తన, వాతావరణం, గతంలాంటి మనం మార్చలేని విషయాల గురించి ఆలోచిస్తూ కుమిలిపోతుంటాం. కానీ ఎంత ఆలోచించినా, ఎంత బాధపడినా అవి మారవు. దీనివల్ల జరిగేది ఒక్కటే – మన మానసిక శక్తి, సమయం వృథా అవడం. నిజమైన జ్ఞానులు ఎప్పుడూ తమ దృష్టిని తాము మార్చగలిగే విషయాలపైనే కేంద్రీకరిస్తారు. ఇదే జీవితంలో నిజమైన పురోగతికి పునాది.

మన చేతుల్లో ఏముంది? మన ఆలోచనలు, మన ప్రయత్నాలు, మన ప్రతిస్పందన విధానం, మన అలవాట్లు –ఇవే మనం నియంత్రించగలిగేవి. ఉదాహరణకు ఎవరైనా మనల్ని విమర్శిస్తే, ఆ విమర్శను మార్చలేం, కానీ దానికి ఎలా స్పందించాలో మాత్రం మనమే నిర్ణయించుకోగలం. ఒక పరీక్షలో ఫలితం ఇప్పటికే వచ్చేసిందంటే దాన్ని మార్చలేం, కానీ రేపటి పరీక్షకు ఎలా సిద్ధం కావాలో మన చేతుల్లోనే ఉంటుంది. ఈ చిన్న దృక్కోణ మార్పే జీవితాన్ని సులభతరం చేస్తుంది.

పురాతన స్టోయిక్ తత్వవేత్త ఎపిక్టెటస్ చెప్పిన మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి – *It's not what happens to you, but how you react to it that matters* (మీకు ఏం జరిగిందన్నది కాదు, దానికి మీరు ఎలా స్పందిస్తారన్నదే ముఖ్యం). ఈ ఒక్క వాక్యం మనిషి జీవనశైలిని పూర్తిగా మార్చే శక్తి కలిగినది. ఎందుకంటే మనం నియంత్రించలేని పరిస్థితులపై పోరాడుతూ శక్తిని హరించుకోవడం మానేసి, మన ప్రతిస్పందనపై దృష్టి పెట్టినప్పుడు, ఒత్తిడి తగ్గి, స్పష్టత పెరుగుతుంది. ఈ సూత్రాన్ని దైనందిన జీవితంలో అన్వయించుకుంటే –ట్రాఫిక్‌లో ఆలస్యమైతే కోపగించుకోవడం కంటే, ఆ సమయాన్ని ఆడియో పుస్తకం వినడానికో, ప్రశాంతంగా ఊపిరి తీసుకోవడానికో ఉపయోగించవచ్చు. ఉద్యోగంలో ప్రమోషన్ రాకపోతే, దాన్ని నిర్ణయించే యాజమాన్యాన్ని మార్చలేం, కానీ మన నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం, తదుపరి అవకాశం కోసం సిద్ధపడటం మన చేతుల్లోనే ఉంటుంది. ఇలా ప్రతి రంగంలోనూ మార్చగలిగేది, మార్చలేనిది వేరు చేసి చూడగలిగితే, జీవితం భారంగా కాక తేలికగా సాగుతుంది. తెలుగు సాహిత్యంలో వేమన శతకంలో ఈ భావననే ప్రతిబింబించే పద్యం ఒకటి ఉంది:

"గంగ పాఱిపోవు కదలని కొండల  
చెంతచేరి యదియు చేటు చేయు  
తనకు తానె కీడు తలపెట్టుకొనుటెల్ల  
విశ్వదాభిరామ వినురవేమ"

ఈ పద్యం భావం ఏమిటంటే – ఏవి కదలవో, ఏవి మారవో వాటి జోలికి వెళ్లి బాధపడటం వల్ల మనకే నష్టం. ప్రవహించే గంగలా, మనం కూడా మారే విషయాలతో ముందుకు సాగాలి తప్ప, కదలని కొండల్లా ఉండే పరిస్థితులతో పెనుగులాడకూడదు అని వేమన హితవు పలుకుతున్నారు.

చివరగా, జీవితంలో ప్రశాంతత, విజయం రెండూ కావాలంటే ఒక్కటే మార్గం –మార్చలేని వాటిని అంగీకరించడం, మార్చగలిగిన వాటిపై పూర్తి శక్తితో దృష్టి పెట్టడం. ఇదే నిజమైన జ్ఞానం, ఇదే నిజమైన శక్తి!

-మహాదేవ

---

# ప్రతి పల్లెకూ చేరని ఫైబర్ బాట!

గ్రామ పరిపాలనలో వేగం, పారదర్శకత పెంచడంలో డిజిటల్ మౌలిక సదుపాయాలదే కీలక పాత్ర. దేశ జనాభాలో 90 కోట్ల మంది గ్రామాల్లోనే నివసిస్తున్న నేపథ్యంలో, పంచాయతీలను కంప్యూటరీకరించే ప్రయత్నాలు వేగం పుంజుకుంటున్నాయి. అయితే పంజాబ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్ సహా పలు రాష్ట్రాల్లో వేలాది పంచాయతీలకు ఇప్పటికీ కంప్యూటర్లే లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ లోటు పూడ్చేందుకు కేంద్రం 'దాన్‌వీర' పథకాన్ని తీసుకురాగా, 2.18 లక్షల పంచాయతీలకు ఫైబర్ కనెక్టివిటీ అందించిన 'భారత్‌నెట్' మూడో దశ ఇంకా కొనసాగుతోంది. అయితే నిదానమైన నెట్ వేగం, తెగిపోయే కేబుళ్లు, విద్యుత్ కోతలు లక్ష్య సాధనకు అడ్డంకిగా మారుతున్నాయి. గ్రామాల్లో ప్రతి వందమందికి 48.31 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉంటే, నగరాల్లో ఇది 126.80గా ఉండటం డిజిటల్ విభజనకు అద్దం పడుతోంది. క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కల్పన, నిర్వహణపై ప్రభుత్వాలు నిర్దిష్ట కార్యాచరణ చేపడితేనే గ్రామీణ భారతం నిజమైన డిజిటల్ యుగంలోకి అడుగుపెడుతుంది.





గ్రామ పరిపాలన వేగవంతం కావాలన్నా, పారదర్శకత పెరగాలన్నా డిజిటల్ మౌలిక సదుపాయాలే కీలకం. ప్రభుత్వాలు, ప్రజల మధ్య నేరుగా అనుసంధానానికి ఇవే బలమైన వారధిగా మారుతున్నాయి. దేశ జనాభాలో దాదాపు 90 కోట్లమంది ఇప్పటికీ గ్రామాల్లోనే జీవిస్తున్న నేపథ్యంలో, ఆధునిక సాంకేతికతను పల్లెల వరకూ సమర్థంగా విస్తరించినప్పుడే వికసిత భారత్ లక్ష్యం సాకారమవుతుంది. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ పంచాయతీలు, ఈ–గ్రామ్‌స్వరాజ్ వంటి పథకాలకు శ్రీకారం చుట్టాయి. పంచాయతీ కార్యాలయాల్లో అధికారిక వ్యవహారాలన్నింటినీ కంప్యూటరీకరించడం ఇందులో ప్రధాన లక్ష్యం. దీనివల్ల ధ్రువీకరణ పత్రాల జారీ, పన్నుల వసూలు, ఆస్తుల నమోదు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, నిధుల వినియోగ పర్యవేక్షణ వంటి పనులు వేగవంతమై, ప్రజలకు అనవసర తిరుగుళ్లు, ఖర్చులు తప్పుతున్నాయి. గతంలో ఒక సాధారణ ధ్రువీకరణ పత్రం కోసం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు కంప్యూటరీకరణ జరిగిన చోట్ల ఇవి కొన్ని నిమిషాల్లోనే పూర్తవుతున్నాయి. అయితే వాస్తవ పరిస్థితి చూస్తే, దేశవ్యాప్తంగా వేలాది పంచాయతీల్లో నేటికీ కంప్యూటర్లే లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. పంజాబ్‌లో కేవలం రెండు శాతం పంచాయతీల్లోనే కంప్యూటర్లు ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, హరియాణా వంటి రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి. ఇలాంటి పంచాయతీల్లో ఇప్పటికీ కాగితం రిజిస్టర్లపైనే లావాదేవీలు నమోదు చేయాల్సి వస్తోంది, దీనివల్ల లెక్కల్లో తప్పులు, జాప్యాలు, పారదర్శకత లోపం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ లోటును పూడ్చేందుకు కేంద్రం ఇటీవల 'దాన్‌వీర' పథకాన్ని తెరపైకి తెచ్చింది. దాతృత్వం చూపే వ్యక్తులు, సంస్థలు నేరుగా పంచాయతీలకు కంప్యూటర్లు అందించేలా ఈ పథకం అవకాశం కల్పిస్తోంది. గ్రామీణాభివృద్ధిపై నిజాయితీ ఉన్నవారు దీనిలో భాగస్వాములైతే, పల్లె ప్రగతికి కొత్త ఊపు రావొచ్చు.

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా 2.69 లక్షల గ్రామ పంచాయతీలు, సంప్రదాయ స్థానిక సంస్థల్లో ఇప్పటివరకూ 2.18 లక్షలకు పైగా ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌తో సేవలకు సిద్ధమయ్యాయి. రూ.1.39 లక్ష కోట్లతో చేపట్టిన 'సవరించిన భారత్‌నెట్' మూడో దశకింద, మిగిలిన 2.65 లక్షల పంచాయతీలకు, 3.8 లక్షల పంచాయతీయేతర గ్రామాలకు డిమాండ్ ఆధారంగా ఫైబర్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళిక సిద్ధమైంది. 1.5 కోట్ల గ్రామీణ ఫైబర్ కనెక్షన్లకు ప్రోత్సాహకాలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి. కానీ నిదానమైన నెట్ వేగం, తెగిపోయే కేబుళ్లను వెంటనే బాగు చేయకపోవడం, తరచూ విద్యుత్ కోతలు వంటివి ఈ లక్ష్యాల సాధనకు అడ్డంకిగా మారుతున్నాయి. కొన్నిచోట్ల ఫైబర్ కేబుల్ వేసినా, స్థానిక నిర్వహణ సిబ్బంది కొరత వల్ల నెలల తరబడి రిపేర్లు జరగకపోవడం రైతులు, విద్యార్థులు అనుభవంలోకి వస్తున్న ఇబ్బందుల్లో ఒకటి. జూన్ 2026 నాటికి 43,908 కిలోమీటర్ల ఫైబర్ కేబుల్ వేయగా, 13,494 పంచాయతీలు అప్‌గ్రేడ్ అయినట్టు కేంద్రం వెల్లడించింది. ఫలితంగా గ్రామీణ–పట్టణ డిజిటల్ అంతరం ఇంకా పూర్తిగా తగ్గకపోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరకుండా అడ్డుపడుతోంది. పీఎం–వానీ పథకం కింద 4.09 లక్షలకు పైగా పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేసినా, 'కామన్ సర్వీస్ సెంటర్లు', 'డిజిటల్ ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ డిజిటల్ అక్షరాస్యత పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నా, మౌలిక సదుపాయాల కొరతే వాటి ఫలితాలను పరిమితం చేస్తోంది. అంతేకాకుండా, నెట్‌వర్క్ ఉన్నా వాడకంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల, ముఖ్యంగా వృద్ధులు, మహిళల్లో డిజిటల్ సేవలను వినియోగించుకోవడంలో వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోంది.

గణాంకాలు ఈ అంతరాన్ని మరింత స్పష్టంగా చాటుతున్నాయి. నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ 2.0 ప్రకారం, గ్రామాల్లో ప్రతి వంద మందికి సగటున 48.31 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు మాత్రమే ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 126.80గా నమోదవుతోంది. గ్రామీణ–నగర భారతాల మధ్య నెలకొన్న డిజిటల్ విభజనకు ఇది స్పష్టమైన నిదర్శనం. భారత్‌నెట్ కింద 13.93 లక్షల ఇళ్లకు స్థిర ఫైబర్ కనెక్షన్లు ఇచ్చినా, గందరగోళంగా ఉండే టారిఫ్‌లు, పదేపదే తలెత్తే సాంకేతిక సమస్యలు పథకం పూర్తి ప్రయోజనం అందడానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి.

పల్లెల్లో డిజిటల్ సేవలు పూర్తిస్థాయిలో విస్తరిస్తే కలిగే ప్రయోజనాలు అనేకం. పింఛన్లు, రాయితీలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి చేరి మధ్యవర్తుల జోక్యం, అవినీతి అవకాశాలు తగ్గుతాయి. ఆన్‌లైన్ తరగతులు, ఈ–లెర్నింగ్ వేదికల ద్వారా గ్రామీణ విద్యార్థుల సామర్థ్యాలు నగర విద్యార్థులతో సమానంగా మెరుగుపడతాయి. రైతులకు పంటల సంరక్షణ, ఆధునిక సాగు పద్ధతులపై నిపుణుల సలహాలు నేరుగా చేరి, వాతావరణ సూచనలు, మార్కెట్ ధరల సమాచారం క్షణాల్లో అందుతాయి. దళారుల ప్రమేయం లేకుండా డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లతో అనుసంధానమై రైతులు తమ ఉత్పత్తులను లాభసాటి ధరలకు నేరుగా విక్రయించుకోగలుగుతారు. గ్రామీణ చిన్న వ్యాపారులు, చేతివృత్తుల వారు కూడా డిజిటల్ చెల్లింపు వ్యవస్థలతో అనుసంధానమైతే, తమ ఉత్పత్తులకు నగర మార్కెట్లలోనూ గుర్తింపు, డిమాండ్ పెంచుకునే అవకాశం లభిస్తుంది. ఇవన్నీ సాకారం కావాలంటే కేవలం పథకాల ప్రకటనలతో సరిపోదు. క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కల్పన, నిర్వహణ, డిజిటల్ అక్షరాస్యత శిక్షణలపై ప్రభుత్వాలు నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ చేపట్టాలి. స్థానిక సంస్థలకు మరిన్ని నిధులు, సాంకేతిక సిబ్బందిని కేటాయించి, నిర్వహణ బాధ్యతను జవాబుదారీతనంతో అప్పగించడం కూడా ఇందులో భాగం కావాలి. అప్పుడే గ్రామీణ భారతం నిజమైన అర్థంలో డిజిటల్ యుగంలోకి అడుగుపెడుతుంది, అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాల వరకూ చేరతాయి. ■

---




సింహాన్ని 'మృగరాజు' అని బలం చూసి మాత్రమే కాదు, దాని నిర్ణయాల్లోని కచ్చితత్వాన్ని లెక్కించి కూడా అంటాం. మందలో సోమరిగా ఉండే ఏ సింహాన్నీ మరో సింహం సహించదు, ఎంతటి విధేయత చూపినా వదిలేయడానికి వెనుకాడదు. నాయకత్వమంటే అందరినీ మెప్పించడం కాదు, సరైన వారిని ఎంచుకుని ముందుకు తీసుకెళ్లడం. విధేయత ఒక్కటే అర్హత కాదు, సామర్థ్యం, నిబద్ధత కూడా అంతే ముఖ్యం. కఠినమైన నిర్ణయాలు తీసుకోగలిగినప్పుడే బృందం బలంగా నిలుస్తుంది, నాయకత్వం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

-మహాదేవ

---

## వింతల్లో వింతలు

# మెరుపు స్క్వీజీ వీరుడు



ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ కిటికీలు తుడిచే నిపుణులు ప్రతి ఏటా లండన్‌లో సమావేశమై, "వరల్డ్ విండో క్లీనింగ్ వరల్డ్ కప్" కోసం పోటీ పడతారు. కిటికీలు తుడవడం సాధారణంగా అందరూ చేయగలిగే పనిలా అనిపించినా, ఈ పోటీలో గెలవాలంటే మాత్రం కఠోర శిక్షణ తప్పనిసరి. 71 ఏళ్ల టెర్రీ బరోస్ ఈ క్రీడలో దిగ్గజంగా పేరొందారు. 2009లో కేవలం 9.14 సెకన్లలో మూడు కిటికీలను ఏ మరకా లేకుండా శుభ్రం చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు, ఇప్పటికీ అది అలానే నిలిచి ఉంది. పోటీదారులకు ప్రామాణిక స్క్వీజీ, టీ–బార్ అప్లికేటర్, బకెట్ నీళ్లు, డిటర్జెంట్ ఇచ్చి, మూడు కిటికీలను వేగంగా, పరిశుభ్రంగా తుడవమని చెబుతారు. ముగ్గురు న్యాయనిర్ణేతలు సూక్ష్మంగా గమనిస్తూ, ప్రతి మరక లేదా చుక్కకు అర సెకను, మందపాటి చారలకు ఒక సెకను జోడిస్తారు. వేగం ముఖ్యమే అయినా, శుభ్రత లేకపోతే గెలుపు దక్కదు. విజేతకు వెయ్యి నగదు బహుమతితో పాటు, తోటి నిపుణుల మధ్య గర్వించదగ్గ గుర్తింపు లభిస్తుంది!

# నితీష్ రాణాపై ప్రతీకారం తీర్చుకున్న దిగ్వేష్ రాఠీ

పురానీ ఢిల్లీ 6 స్పిన్నర్ దిగ్వేష్ సింగ్ రాఠీ, వెస్ట్ ఢిల్లీ లయన్స్ బ్యాటర్ నితీష్ రాణా మధ్య గత సీజన్ ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో జరిగిన వివాదానికి ఆసక్తికరమైన ముగింపు లభించింది. గత సీజన్ ఎలిమినేటర్‌లో రాఠీ, రాణా ఒకరినొకరు కవ్వించుకోగా.. రాణా బ్యాట్‌తో పైచేయి సాధించాడు. ప్రస్తుత సీజన్‌లో భాగంగా ఇవాళ జరిగిన మ్యాచ్‌లో ఈ ఇద్దరు మరోసారి ఎదురెదురుపడగా.. రాణాను ఔట్ చేసి రాఠీ రివెంజ్ తీర్చుకున్నాడు. ఈ ప్రతీకార పర్వం క్రికెట్ అభిమానులను అమితంగా ఆకర్షించింది. వివరాల్లోకి వెళితే?.. గత సీజన్ ఎలిమినేటర్‌లో రాణా-రాఠీ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రాఠీ బంతి వేయడానికి వచ్చి చివరి క్షణంలో ఆగడంతో రాణా కూడా అదే తరహాలో స్పందించాడు. ఆ తర్వాత రాఠీ బౌలింగ్‌లో రాణా భారీ సిక్సర్ కొట్టి, అతడి నోట్‌బుక్ సెలబ్రేషన్‌ను అతడికే అప్పజెప్పాడు. ఆ మ్యాచ్‌లో రాణా 55 బంతుల్లో అజేయమైన 134 పరుగులు చేసి వెస్ట్ ఢిల్లీకి విజయాన్ని అందించాడు. ఆ వివాదానికి సంబంధించి అప్పుడు రాఠీ మ్యాచ్ ఫీజులో 80 శాతం, రాణా 50 శాతం జరిమానా విధించారు. తాజాగా జరిగిన మ్యాచ్‌లో రాఠీ రాణాను ఔట్ చేసి, గత సీజన్‌లో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకున్నాడు. 11వ ఓవర్ చివరి బంతికి రాఠీ వేసిన బంతిని రాణా రివర్స్ స్వీప్ చేసేందుకు ప్రయత్నించాడు. బంతి బ్యాట్‌కు తగలకుండా ముందు ప్యాడ్‌కు తగలడంతో ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. రాణా కేవలం 3 పరుగులకే వెనుదిరిగాడు. గత సీజన్ చెడు అనుభవం దృష్ట్యా రాఠీ సాధారణంగానే సంబరాలు చేసుకున్నాడు.



తన స్టయిల్‌లో నోట్‌బుక్ సెలబ్రేషన్ చేసుకోలేదు. అతడు కామ్‌గానే ఉన్నా, పరోక్షంగా రాణాపై ప్రతీకారం? తీర్చుకున్నట్లైంది. ఈ ఉదంతం సోషల్‌మీడియాలో వైరలవుతోంది. మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్ట్ ఢిల్లీ లయన్స్ 180 పరుగులు చేయగా.. పురానీ ఢిల్లీ 17.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. పురానీ ఢిల్లీ విజయంలో దేవ్ లక్రా (64), అనూజ్ రావత్ (49 నాటౌట్), లలిత్ యాదవ్ (30 నాటౌట్) కీలకపాత్ర పోషించారు. రాఠీకి కేవలం రాణా వికెట్ మాత్రమే లభించింది.

## ఆసీస్, ఇంగ్లండ్ వల్ల కాలేదు.. చరిత్ర సృష్టించిన బీసీసీఐ!



భారత ఆటగాడు అజింక్య రహానే ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే రిటైర్మెంట్ పొందిన ఆటగాళ్లకు బీసీసీఐ పెన్షన్ అందిస్తుంది. రహానే సీనియర్ టెస్టు క్రికెటర్ కావడంతో, అతడు నెలకు పెన్షన్ కింద రూ. 70వేలు అందుకోనున్నాడు. ఈ సంగతి పక్కనబెడితే క్రికెట్ చరిత్రలో బీసీసీఐ (భారత్), ఈసీబీ (ఇంగ్లండ్), క్రికెట్ ఆస్ట్రేలియా క్రికెట్ సంపన్న బోర్డులుగా గుర్తింపు పొందాయి. కానీ ఈ మూడు బోర్డుల్లో బీసీసీఐ మాత్రమే రిటైర్మెంట్ ప్రకటించిన ఆటగాళ్లకు గౌరవ వేతనం కింద పెన్షన్ అందిస్తుండడం విశేషం. అటు ఆస్ట్రేలియా కానీ.. ఇటు ఇంగ్లండ్ కానీ తమ మాజీ ఆటగాళ్లకు ఎలాంటి పెన్షన్ సౌకర్యం కల్పించడం లేదు. దీంతో క్రికెట్ చరిత్రలోనే మాజీ ఆటగాళ్లకు పెన్షన్ కల్పిస్తున్న ఏకైక బోర్డుగా బీసీసీఐ చరిత్ర సృష్టించింది. బీసీసీఐ అందిస్తున్న పెన్షన్ విధానాన్ని ఒకసారి పరిశీలించి చూద్దాం.

బీసీసీఐ కల్పిస్తున్న పెన్షన్ వివరాలు

??మాజీ క్రికెటర్లు: నెలకు రూ. 58,750
??టెస్టు క్రికెటర్లు: నెలకు రూ. 60 వేలు
??సీనియర్ టెస్టు క్రికెటర్లు: నెలకు రూ. 70 వేలు
??ఫస్ట్ క్లాస్ క్రికెటర్లు: నెలకు రూ. 30 వేల నుంచి 45వేలు
??అంతర్జాతీయ మహిళా క్రికెటర్లు: నెలకు రూ. 52,500
దేశవాళీ మహిళా క్రికెటర్లు: నెలకు రూ. 45వేలు

ఇక దేశవాళీ క్రికెట్‌లో రాష్ట్రాల వారీగా చూసుకుంటే గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ తమ రాష్ట్రం తరఫున రంజీ ట్రోఫీ ఆడిన 150 మంది మాజీ క్రికెటర్లకు పెన్షన్‌తో పాటు అన్ని సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదర్శంగా నిలిచింది. మిగతా రాష్ట్రాల బోర్డులు కూడా తమ మాజీ క్రికెటర్లకు తమకు తోచినంత పెన్షన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి.

# స్పోర్ట్స్

## ఆటగాళ్లకు ఫిట్‌నెస్ సమస్యలు.. చీఫ్ ఫిజియోపైనా బీసీసీఐ నజర్!



ఇంటర్నెట్ డెస్క్: యూకే పర్యటనలో వరుస ఓటముల కారణంగా భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బృందంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే ఇప్పటికే జట్టును వీడిన సంగతి తెలిసిందే. గత కొన్నాళ్లుగా ఫీల్డింగ్ దారుణంగా ఉండటంతో భారత జట్టుకు కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను బీసీసీఐ నియమించింది. ఇప్పుడు చీఫ్ ఫిజియో కమ్లేశ్ జైన్ (జష్ట్రఅవట జూష్ట్రఎంఅశీ ఖుఎశ్రీవంష్ట్ర జీఖఅఅ)పైనా బోర్డు దృష్టి సారించినట్లు వార్తలు వస్తున్నాయి. శ్రీలంకతో సిరీస్ అనంతరం ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. నితిన్ పటేల్ స్థానంలో 2022లో కమ్లేశ్ చీఫ్ ఫిజియోగా బాధ్యతలు స్వీకరించారు. అయితే, గత కొద్ది నెలలుగా భారత (ంఖుఎ ×అఎఖు) ఆటగాళ్లు ఎక్కువగా గాయాలపాలు కావడం పెద్ద చర్చకు దారితీసింది. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్ గాయంతో జట్టుకు దూరమయ్యారు. తాజాగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా లంకతో టెస్టు సిరీస్ నుంచి వైదొలిగాడు. అంతకుముందు ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో కెప్టెన్ గిల్, గుర్నూర్ బ్రార్ కండరాలు పట్టేయడంతో ఇబ్బంది పడటం చూశాం. ప్లేయర్ల గాయాల విషయంలో చీఫ్ ఫిజియోగా కమ్లేశ్ పనితీరుపై ప్రధాన కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ సమస్యలతో అత్యుత్తమ టీమ్‌ను బరిలోకి దింపలేకపోతున్నట్లు అసహనం వ్యక్తం చేసినట్లూ వార్తలు వచ్చాయి.

### సీవోఈపైనా ప్రశ్నలు

చీఫ్ ఫిజియో కమ్లేశ్ జైన్‌తోపాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(జూజు) పనితీరుపైనా అనుమానాలు వస్తున్నాయి. బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసైనట్లు తొలుత సీవోఈ ప్రకటన చేసింది. తీరా, ఒక్క రోజు వ్యవధిలోనే అతడి గాయం ఇంకా మానలేదని.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో ఆడటం లేదని వెల్లడించింది. ఇక్కడా మేనేజ్‌మెంట్ సరిగా లేదనే విమర్శలు వస్తున్నాయి. స్క్వాడ్‌లోకి రావాలంటే తీవ్ర పోటీ ఉన్న ఇలాంటి సమయంలో గాయాల వల్ల కెరీర్‌లు డోలాయమానంలో పడే ప్రమాదం ఉందనేది కొందరి వాదన. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా విషయంలోనూ ఇలాంటి తప్పిదాలే జరిగాయి. దీంతో శ్రీలంకతో టెస్టు సిరీస్ అనంతరం కోచింగ్ బృందంతోపాటు ఫిజియో, టీమ్ డాక్టర్ స్థానాల్లోనూ కొత్తవారు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం టీమ్ డాక్టర్‌గా రిజ్వాన్ ఖాన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.




# మహేష్ లైన్ లో సందీప్..బుచ్చిబాబు!

సూపర్ స్టార్ మహేష్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజమౌళి దర్శకత్వంలో 'వారణాసి' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గ్లోబల్ స్థాయిలో భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాపై పాన్ ఇండియాలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఇంకా 80 రోజుల షూటింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉంది. అనంతరం మహేష్ 'వారణాసి'ని నుంచి రిలీవ్ అయిపోతారు. ఈ నేపథ్యంలో మహేష్ తదుపరి సినిమా ఏ డైరెక్టర్ తో చేస్తారు? అన్నది సర్వాత్రా ఆసక్తి నెలకొంది. రాజమౌళి ప్రాజెక్ట్ తర్వాత మహేష్ లైనప్ ఎలా ఉండబోతుందనే ఆసక్తి నటుడి అభిమానులతో పాటు ట్రేడ్ వర్గాల్లోనూ నెలకొంది. ఈ రేసులో ప్రముఖ దర్శకులు సందీప్ రెడ్డి వంగా, బుచ్చిబాబు సానా పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇద్దరు టాప్ డైరెక్టర్లతో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో క్రేజీ కాంబినేషన్లపై ఇండస్ట్రీలో రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ట్రెండ్ సెట్టింగ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న సందీప్ రెడ్డి వంగాతో మహేష్ తో సినిమా ఉండొచ్చనే వార్తలు సోషల్ మీడియాలో అవుతున్నాయి. -యానిమల్- వంటి సంచలన చిత్రం తర్వాత సందీప్ ప్రస్తుతం ప్రభాస్‌తో -స్పిరిట్- సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే మహేష్ తో సినిమా చేసేందుకు ఆయన కథా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇద్దరి కలయిక కుదిరితే బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయం. మరోవైపు -ఉప్పెన- చిత్రంతోనే జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన బుచ్చిబాబు సానా పేరు కూడా బలంగా వినిపిస్తోంది. ఇటీవలే రామ్ చరణ్ కు పెద్దితో పాన్ ఇండియా విజయాన్ని అందించిన నేపత్యంలో బుచ్చి పేరు పరిశ్రమలో మారు మ్రోగిపోతుంది. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు తదుపరి మహేష్ కోసం సీరియస్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మహేష్ కు సరిపోయే బలమైన కథను బుచ్చిబాబు సిద్ధం చేస్తున్నారని.. త్వరలోనే దీనికి సంబంధించి స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. బుచ్చిబాబు రెండవ సినిమాతోనే ఏకంగా రామ్ చరణ్ నే డైరెక్ట్ చేసి మెప్పించిన నేపథ్యంలో మహేష్ ని ఒప్పించడం పెద్ద కష్టం కాదు. పైగా బుచ్చి బాబు కథల్లో మట్టివాసన ఉంటుంది. స్టోరీల పరంగా నేల విడిచి సాము చేయడు. తీసిన రెండు సినిమాలు కూడా మంచి ఫలితాలు సాధించాయి. ఈ నేపథ్యంలో మహేష్ బుచ్చి కి నో చెప్పడం అంత సులభం కాదు. మొత్తానికి -వారాణాసి- విడుదల తర్వాత మహేష్ ఏ దర్శకుడితో సెట్స్ పైకి వెళ్తారు అనేది ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా -బుచ్చిబాబు సానా ఇద్దరూ రేసులో ఉండటంతో అభిమానులలో అంచనాలు తారాస్థాయికి చేరుతున్నాయి. త్వరలోనే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం లేకపోలేదు.






PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com